


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 16-12-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 83 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## యుద్ధంతో కాదు.. విజ్ఞానంతోనే మార్పు

### ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గుతోందని, భారత్‌లో మాత్రం పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుండటం హర్షించ తగిన విషయమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. భారత్‌లో పుస్తక పఠనం పెరుగుతోందని నీల్సన్ సర్వే సంస్థ తెలిపిందని ఆయన వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ పుస్తక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. నేషనల్ బుక్ ఫెయిర్ -2018 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. పుస్తక పఠనం ఆవశ్యకతను ఆయన వివరించారు. శరీరానికి వ్యాయామం ఎంత ముఖ్యమో.. మెదడును చైతన్యవంతం చేయడానికి పుస్తకం అంతకన్నా ముఖ్యమన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. తొలి స్థానంలో కోల్‌కతా నిలిచిందని వివరించారు. పశ్చిమ్‌బంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్ల విలువచేసే పుస్తకాలను కొనుగోలు చేసి రాష్ట్ర గ్రంథాలయాలకు, విద్యా సంస్థలకు అందజేయడంతో పాటు అక్కడ ప్రజలకు సాహిత్యం పట్ల అభిమానం ఎక్కువ కావడం వల్లే తొలి స్థానంలో నిలిచిందన్నారు. అలాంటి సహాయ సహకారాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు అందితే మన పుస్తక ప్రదర్శన సునాయసంగా తొలి స్థానాన్ని చేరుకుంటుందన్నారు.

## ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవడానికైనా

# సిద్ధంగా ఉండాలి



### దూసుకొస్తున్న పెథాయ్

### తుపానుగా మారిన తీవ్రవాయుగుండం

### 'పెథాయ్'పై చంద్రబాబు సమీక్ష

అమరావతి : 'పెథాయ్' తుపాను పరిస్థితులపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని అధికారులు ఆయనకు వివరించారు. జిల్లాల్లో తుపాను ముందస్తు సన్నద్ధతలపై సీఎం ఆర్టీజీఎస్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి యంత్రాంగంతో నిత్యం పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

తీవ్ర వాయుగుండం శనివారం మధ్యాహ్నం తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. వాయుగుండం తరువాయి 2లో..

## 8 మండలాల్లో స్కూళ్లకు సెలవు

### కలెక్టర్ కార్తికేయ మిశ్రా



కాకినాడ: పెథాయ్ తుపాను తీవ్ర వాయుగుండంగా మారింది. శ్రీహరి కోటకు 705 కి.మీల దూరంలో ఈ తుపాను కేంద్రీకృతమైంది. పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతున్న పెథాయ్.. ఈ నెల 17 సాయంత్రానికి అమలాపురం - కళింగపట్నం మధ్య తీరం దాటే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ తరువాయి 2లో..

## కమలనాధుల కార్యాచరణ



వార్త 2వ పేజీలో..



# అదే నా లక్ష్యం

- లోక్‌సభ ఎన్నికల్లో 16 సీట్లు సాధించాలి
- తెరాసకు ప్రజలు చిరస్మరణీయ విజయం కట్టబెట్టారు
- మీట్ ది ప్రెస్‌లో తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్: ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో తెరాసకు ప్రజలు చిరస్మరణీయమైన విజయం కట్టబెట్టారని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. అలాగే వచ్చే ఆర్నెల్లలో రాష్ట్రంలో జరగబోయే వివిధ ఎన్నికలను సమర్థంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత తనపై ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎన్నికల్లో తెరాసకు చిరస్మరణీయ విజయం లభించింది. అన్ని తరువాయి 2లో..

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయి నుంచి దిల్లీ మీదుగా లఖ్‌నవూ వెళ్లాల్సిన ఓ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విమానాన్ని నిలిపివేశారు. విమానాన్ని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి తనిఖీలు చేశారు. ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం..

ఇండిగో విమానం శనివారం ఉదయం 6.05గంటలకు ముంబయి ఎయిర్‌పోర్టు నుంచి లఖ్‌నవూ బయల్దేరాల్సి ఉంది. అయితే టేకాఫ్ అవడానికి ముందు ఈ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. గో ఎయిర్ విమానంలో దిల్లీ వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ మహిళ విమానాశ్రయం టర్మినల్ 1 వద్ద ఉన్న ఇండిగో చెకిన్ కౌంటర్ దగ్గరకు వెళ్లి.. ఇండిగో 6ఈ 3612(ముంబయి-లఖ్‌నవూ మార్గం) విమానంలో బాంబు ఉన్నట్లు చెప్పారు. అనుమానితులుగా భావిస్తున్న కొందరి ఫొటోలను సాక్ష్యాలుగా చూపించారు. సదరు వ్యక్తులు బాంబు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

బాంబు బెదిరింపుల అసెస్‌మెంట్ కమిటీ కూడా ప్రమాదం జరగొచ్చని అనుమానాలు వ్యక్తం చేయడంతో అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే ప్రయాణికులను దింపేసి విమానాన్ని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీంతో విమానానికి ఎలాంటి ప్రమాదం లేదని భద్రతాసిబ్బంది స్పష్టం చేశారు.




## శ్రీలంక ప్రధాని రాజపక్స రాజీనామా



కొలంబో: సింహళ దేశం శ్రీలంకలో గత రెండు నెలలుగా నెలకొన్న రాజకీయ సంక్షోభం ఓ కొలిక్కి వచ్చింది. ప్రధానమంత్రి పదవికి సీనియర్ నేత మహింద రాజపక్స శనివారం రాజీనామా చేశారు. దేశ స్థిరత్వం కోసం తన తండ్రి ప్రధాని పదవి నుంచి వైదొలగనున్నట్లు రాజపక్స కుమారుడు నమల్ నిన్న ట్విటర్ వేదికగా ప్రకటించిన విషయం తెలిసిందే. శనివారం ఆయన తన రాజీనామాను సమర్పించారు.

ప్రధానిగా ఉన్న రణిల్ విక్రమ్‌సింఘేను ఆకస్మికంగా తప్పించి ఆయన స్థానంలో మహింద రాజపక్సను నియమిస్తూ ఈ ఏడాది అక్టోబరు 26న శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన సంచలన ప్రకటన చేశారు. దీంతో ఆ దేశంలో రాజకీయ సంక్షోభం తలెత్తింది. ఈ నేపథ్యంలో ప్రధాని బాధ్యతలు స్వీకరించిన రాజపక్స పార్లమెంట్‌లో తన మెజార్టీని నిరూపించుకోవాల్సి ఉండగా.. రెండు సార్లు అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయారు. దీంతో పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు నవంబరు 9న అధ్యక్షుడు సిరిసేన మరో ప్రకటన చేశారు.

అయితే దీనిపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. పార్లమెంట్ రద్దు చెల్లదని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. మరోవైపు రాజపక్స ప్రధానిగా కొనసాగకుండా అప్పీల్ కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ తీర్పుపై రాజపక్స సుప్రీంకోర్టుకు వెళ్లగా అక్కడ ఆయనకు నిరాశే ఎదురైంది. అప్పీల్ కోర్టు తీర్పుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలో రాజపక్స రాజీనామాకు సిద్ధమయ్యారు. ఈ విషయమై శుక్రవారం రాత్రి మైత్రిపాల సిరిసేనతో చర్చలు జరిపారు. సిరిసేన కూడా అంగీకరించడంతో రాజపక్స నేడు ప్రధాని పదవికి రాజీనామా చేశారు.

### మళ్లీ ప్రధాని పీఠంపై రణిల్

కాగా.. రాజపక్స రాజీనామాతో మళ్లీ రణిల్ విక్రమసింఘే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు సిరిసేన అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆదివారం రణిల్ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయి.



# న్యాయం అడిగితే బెదిరిస్తారా : జనసేన నాయకులు సీతారాం



అనకాపల్లి .... సంపతిపురం శివారు టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో సాగులో ఉన్న రైతులను భయపెడితే ఎంతమాత్రం సహించేది లేదని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం అన్నారు. రిలే దీక్షల్లో భాగంగా శుక్రవారం రాత్రి తమ్మయ్యపేటలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ సుమారు 100 మంది రైతులు ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారనే విషయం అధికారులకు తెలిసినా పరిహారం ఇవ్వకుండా భూములు సేకరించడానికి చర్యలు తీసుకోవడం పూర్తిగా అన్యాయమన్నారు. పరిహారం కోసం పోరాడుతుంటే భయపడుతున్నారన్నారు. గ్రామ సర్పంచి నంబారు శ్రీను తన కుటుంబీకులు పేర్లను జాబితాలో చేర్చి అక్రమంగా పరిహారం కాజేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడన్నారు. దీనిని ఖండించిన జనసేన పార్టీ నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని పోరాటం చేస్తుంటే తమ పోరాటం వలనే పరిహారం రావడం లేదని ప్రచారం జరుగుతోందన్నారు.

రైతులు ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. రైతులతో కలిసి మూడు రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. సంపతిపురం సర్పంచి నంబారు శ్రీను నిజంగానే నిజాయితీ పరుడైతే తమతో కలిసి పోరాటం చేసేవాడన్నారు. రైతులకు పరిహారం చెల్లించే వరకూ పోరాటం ఆగదన్నారు. అవసరమైతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే దిగవచ్చి రైతులకు పరిహారం చెల్లించాలని సీతారాం డిమాండ్ చేశారు. దీనికి ముందుగా గ్రామానికి చెందిన రైతు భరణికాన శేషగిరి మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి 9 ఎకరాల భూమిని సాగు చేస్తుండగా కేవలం మూడు ఎకరాల భూమి సాగు చేస్తున్నట్లు మాత్రమే నమోదు చేశారని తెలిపారు. ఇలా చాలా మంది రైతులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం ఉన్నారనే ధైర్యం తమకుందన్నారు. న్యాయం జరిగే వరకు ఆయన వెంట నడిచి పోరాడుతామని చెప్పారు. ఇదిలా ఉండగా శనివారం నాటికి దీక్ష నాల్గవరోజుకి చేరుకున్నాయి. ఈ దీక్షలో పలువురు రైతులు స్వచ్ఛదంగా వచ్చి దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి అప్పారావు, బోర రాజు, ఉరుకూటి బాబూరావు, జనసేన నాయకులు పాము పైడిరాజు, నంబారు రమణ, పల్లా శ్రీను, షేక్ ఉమం , సురభి హరీష్, గల్లా వినోద్, దాడి బుజ్జి, నిమ్మదల సురేష్, రాజనాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా భరోసాయాత్రలో అధీప్‌రాజ్‌కు జననీరాజనం

### చినగొల్లలపాలెం ప్రజలు అధీప్‌రాజ్‌కు బ్రహ్మరథం పట్టారు

సబ్బవరం : సబ్బవరం మండలంలో 13వరోజు ప్రజాభరోసా యాత్రలో అధీప్‌రాజ్ పాదయాత్ర పెదనాయుడుపాలెం గ్రామాల నుండి శనివారం ప్రారంభమై జోడుగుళ్ళపాలెం మీదుడా చినగొల్లెలపాలెం గ్రామంలో ప్రవేశించిగానే అక్కడి మహిళలు వైసీపీ నేత అధీప్‌రాజ్‌కు హారతులిచ్చి పూలవర్షం కురిపించారు. జన నీరాజనంతో అధీప్‌రాజ్ ఉబ్బితబ్బియ్యారు. ఆనందంతో అత్యుత్సాహంతో అధీపఃరాజ్ మాట్లాడుతూ ఇక్కడున్న ప్రజలందరికి నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ పాద యాత్రలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కొటాన రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధీప్‌రాజ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు టీడీపీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చకపోగా ఎన్నికల తరుణంలో నిరుద్యోగ భభుతి నిరుద్యోగులకు ఇస్తామని మోసపూరిత హామీలు ఇస్తుందన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్టీఆర్ గృహ పథకంలో అర్హులైనవారికి ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఇక్కడి మహిళలు గ్రామానికి డ్రైనేజీలు లేవని, కుళాయిలు లేవని అధీప్‌రాజ్‌కు విన్నవించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనం అచ్చింనాయుడు, తుంపాల అప్పారావు, సబ్బవరపు ముత్యాలు



నాయుడు, సబ్బవరపు నారాయణమూఇర్త, సింగంపల్లి రామకృష్ణ, నక్కా కనకరాజు, కొటాన కోటయ్య, ఎల్.కేశవరావు, టి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 18న రామనారాయణంలో ఉత్తరద్వార దర్శనం

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో 18వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నామని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 16వ తేదీన సాయంత్రం 5 గంటల 29 నిమిషాలకు నెలగంట పెట్టుటతో పాటు కలశ పూజ, విశేష కుంకువార్చనతో ధనుర్మాస ఉత్సవాలు రామనారాయణంలో ప్రారంభం కానున్నాయని, నెలరోజుల పాటు దేవాలయం ప్రధాన అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో ప్రతీ రోజూ ఉదయం 8 గంటలకు కుంకుమార్చన, తిరుప్పావై పఠనం, తీర్థగోష్టి ఉంటాయని, భక్తులందరూ పాల్గొని గోదాదేవి ఆశీస్సులు పొందాలని కోరారు. విలేకరుల సమావేశంలో ప్రాంగణం పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరాజు, ఎం వి రమణ తదితరులు పాల్గొన్నారు.

## మీ ఓటు ఇలా తెలుసుకోండి

విజయనగరం : జిల్లాలోని ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో, ఏ సీరియల్ నెంబరులో ఉందో తెలుసుకునేందుకు కలక్టరేట్‌లో 08922-278770 నెంబరుకు సంప్రదించి తెలుసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1070 నెంబరు సాంకేతిక కారణాల వల్ల పనిచేయటం లేదని పేర్కొన్నారు.

# కమలనాధుల కార్యాచరణ

### కారు స్పీడుకు ఖంగుతిన్న భాజపా .. శ్రేణుల్లో ధైర్యం నింపాలి

### తెలంగాణలో పర్యటించనున్న మోదీ, అమిత్ షా

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ కార్యచరణ సిద్ధం చేస్తోంది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఈనెల 24న కమలదళాధిపతి అమిత్ షా, జనవరి మొదటి వారంలో ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రం పర్యటనకు రానున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో తీవ్ర నిరుత్సాహానికి గురైన కార్యకర్తల్లో జాతీయ నాయకత్వం ద్వారా నూతన ఉత్తేజాన్ని తీసుకురావాలని తలపెట్టింది.

రాష్ట్రంలో జరిగిన ముందస్తు ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా 118 స్థానాల్లో పోటీ చేసిన భాజపా ఏకంగా 105 స్థానాల్లో ధరావత్ కోల్పోయింది. కేవలం 13 చోట్ల మాత్రమే డిపాజిట్లు దక్కాయి. 2019లో కేంద్రంలో తిరిగి భాజపా అధికారంలోకి రావాలంటే దక్షిణాదిన రాష్ట్రాల్లోనూ పార్టీని పటిష్ఠం చేసేందుకు అగ్రనాయకత్వం ప్రణాళికలు రచించింది. తెలంగాణలో జరిగిన ఎన్నికలతో దక్షిణాదిన పాగా వేయాలని భావించినప్పటికీ తీవ్ర నిరాశే ఎదురైంది. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాతో పాటు 15 మంది కేంద్ర మంత్రులు, పలువురు భాజపా పాలిత ముఖ్యమంత్రులు ప్రచారం నిర్వహించినప్పటికీ ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. ఐదు సిట్టింగ్ స్థానాలతోపాటు మరో 10 సీట్లు గెలిచి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని భావించినప్పటికీ కారు ధాటికి ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో నలుగురు పరాజయం చెందారు. కేవలం ఒక్క గోషామహల్ స్థానాన్ని మాత్రమే దక్కించుకోగలిగింది. భారీ అంచనాలు పెట్టుకున్న కమలనాథులకు ఎన్నికల ఫలితాలు కంగుతినిపించాయి. తెలంగాణ, మిజోరంలో అత్యధిక సీట్లు సాధించాలనే లక్ష్యం నెరవేరకపోగా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో భాజపా అధికారాన్ని కోల్పోయింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా, పార్టీ అధ్యక్షులు, పదాధికారులతో సమావేశమై పరాజయానికి గల కారణాలను విశ్లేషించారు.

తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు భాజపా సిద్ధమైంది. ఎన్నికల ఫలితాల నుంచి తేరుకుని ప్రజా క్షేత్రంలోకి వెళ్లేలా ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా ఈనెల 24న రాష్ట్రంలో పర్యటించి కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపనున్నారు. జనవరి మొదటివారంలో ప్రధాని నరేంద్రమోదీపాటు పలువురు కేంద్రమంత్రులు రానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి కారు స్పీడుకు బ్రేకులు వేయాలని యోచిస్తోంది. దాంతో ఏప్రిల్‌లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కనీసం రెండు, మూడు సీట్లు దక్కించుకుని గులాబీ తోటలో కమలాన్ని వికసింపచేయాలని కమలనాథులు ఆరాటపడుతున్నారు.

# చోడవరం ఎమ్మెల్యే రాజుకు ధన్యవాదములు తెలియజేసిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

### - లబ్ధి పొందనున్న 12 వేల మంది క్షేత్ర సహాయకులు

చోడవరం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులను రెగ్యులర్ చేయడంలో స్థానిక ఎమ్మెల్యే చేసిన కృషికి సిబ్బంది ధన్యవాదములు తెలియజేసారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజును నాలుగు మండలాల వీఆర్పీలు కలిసారు. వీఆర్పీ సంఘ అధ్యక్ష, కార్యదర్సులు బోడి రాజు, శరగడం రాములు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 288 మంది క్షేత్ర సహాయకులను ఫిక్సిడ్ టెన్యూర్ ఉద్యోగులుగా గుర్తిస్తూ సంబంధిత పంచాయితీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయంతో 12 వేల మంది క్షేత్ర సహాయకులు లబ్ది పొందనున్నట్లు తెలియజేసారు.

లిష్ట్ 2 గ్రామ పంచాయితీల్లో పనిచేస్తున్న జూనియర్ మేట్లు వేతనాలు రూ.4,500లు నుండి రూ.5,500లకు పెంపుదల చేసినట్లు తెలిపారు. పెంచిన వేతనాలు జూలై 2018 నుండి ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు చనిపోయిన ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఇవ్వనున్న పరిహారాన్ని రూ.3 లక్షల నుండి 5 లక్షలకు పెంచారన్నారు. చంద్రన్న భీమాతో సంబంధం లేకుండా 5 లక్షల భీమా వర్తిస్తుందన్నారు. అలాగే కుటుంబంలోని వారందరకు ఈ భీమా వర్తిస్తుందని తెలియజేసారు. ఆరోగ్య సమస్యలున్నప్పుడు 30 రోజులు శెలవుతోబాటు, మరొక 20 రోజులు వేతనంతో కూడిన శెలవులకు అంగీకరించినట్లు తెలియజేసారు. జూనియర్ మేట్లను సీనియర్ మేట్లను ఫీల్డు అసిస్టెంట్లుగా మార్పునకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ విధానలకు అత్యంత కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన ఉద్యోగ భద్రతతో బాటు ఫీల్డు అసిస్టెంట్లు అందరకు ఎన్టీఆర్ ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైచర్లపాలెం వీఆర్పీ మైచర్ల గవర్రాజు, దామునా పల్లి వీఆర్పీ పాలిశెట్టి పూర్ణ, బర్ల సంతోష్, రోలుగుంట, రావికమతం, బుచ్చయ్యపేట, చోడవరం ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజును కలిసిన ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. క్షేత్ర సహాయకులు

మొదటి పేజీ తరువాయి

## ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవడానికైనా సిద్దంగా ఉండాలి

మార్పులను అనుక్షణం గమనించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు. ఆర్టీజీఎస్‌లో తుపాను పరిస్థితి ఎదుర్కోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు వివరించారు. పరిష్కార వేదిక 1100 కాల్ సెంటర్ నుంచి తుపాను జాగ్రత్తల సందేశాలు జారీ చేయాలని, ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా వారి పడవలు తీరంలోనే నిలిపివేయాలని సూచించారు. తుపాను సంబంధిత విభాగాల అధికారులు ఆర్టీజీఎస్‌లో ఉంటూ పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. తుపాను నేపథ్యంలో రాత్రిపూట కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.

సీఎం చంద్రబాబు సమీక్ష

పెథాయ్ తుపాను పరిస్థితులపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని అధికారులు ఆయనకు వివరించారు. జిల్లాల్లో తుపాను ముందస్తు సన్నద్ధతపై సీఎం ఆర్టీజీఎస్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి యంత్రాంగంతో నిత్యం పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

దూసుకొస్తున్న పెథాయ్

తుపానుగా మారిన తీవ్రవాయుగుండం

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారింది. ఇది చెన్నైకి సుమారు 775 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. పెథాయ్‌గా నామకరణం చేసిన ఈ తుపాను ముందస్తు అంచనాల ప్రకారం కళింగపట్నం వద్ద తీరం దాటే అవకాశం ఉంది. తూర్పుగోదావరి, ఉత్తర కోస్తాంధ్ర మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నెల 17 సాయంత్రం పెథాయ్ తీరం దాటనుంది. ఈ ప్రభావంతో మరో 24 గంటల్లో కోస్తాంధ్ర అంతటా మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర తీరం వెంబడి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. అలల ఉద్ధృతి పెరిగే సూచనలు ఉనట్లు ఇన్‌కాయిస్ హెచ్చరికలు జారీ చేసింది.

పెథాయ్ తుపాను నేపథ్యంలో వాతావరణశాఖ అధికారులు కోస్తాంధ్ర జిల్లాలతో పాటు తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేశారు. 15న కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడులో కొన్నిచోట్ల భారీ వర్షాలు, 16, 17న కోస్తాలోని పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు, అలాగే 17వ తేదీ కోస్తాతో పాటు ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీద కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పారు. శనివారం నుంచే కోస్తా తీరంలో గాలుల తీవ్రత ఉంటుందని చెబుతున్నారు. 16వ తేదీ నుంచి గంటకి 80 కి.మీ నుంచి 110 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## 8 మండలాల్లో స్కూళ్లకు సెలవు

శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తుపాను నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

ఎనిమిది మండలాల్లో 50కి పైగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అక్కడి ప్రజలకు తాగునీరు, ఆహారం, విద్యుత్ తదితర ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో అందుబాటులో నలుగురు ఐఏఎస్‌లను ఉంచినట్టు ఆయన తెలిపారు. సహాయక చర్యల కోసం ఆర్డీవో, తహసీల్దార్, డీఎస్పీల వద్ద అత్యవసర నిధులు ఉంచినట్టు పేర్కొన్నారు. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో పాఠశాలలకు సోమ, మంగళవారం కలెక్టర్ సెలవులు ప్రకటించారు. జిల్లాకు రెండు ఎస్డీఆర్‌ఎఫ్, రెండు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను తరలించినట్టు తెలిపారు. తుపాను తీవ్రత 1996 కంటే తక్కువగా ఉంటుందని తమకు సమాచారం ఉందన్నారు.

## అదే నా లక్ష్యం

రాజకీయ పక్షాలు ఒకవైపు, కేసీఆర్ ఒకవైపు నిలబడితే ప్రజల తీర్పు కేసీఆర్ పక్షాన నిలవడం ఆనందంగా ఉంది. అందుకు ప్రజలకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నా. 2 కోట్ల మంది ఓటింగ్ పాల్గొంటే 98 లక్షల ఓట్లు తెరాసకు వచ్చాయి. ఆ తర్వాతి స్థానంలో నిలిచిన కాంగ్రెస్‌కు, మా పార్టీకి మధ్య 45 లక్షల ఓట్ల వ్యత్యాసం ఉంది. మరో జాతీయ పార్టీగా చెప్పుకునే భాజపాకు 103 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతయ్యాయి. 100 స్థానాల్లో డిపాజిట్లు పోతాయని ఎన్నికలకు ముందే చెప్పా. ఆ పార్టీ తరఫున మోదీ, అమిత్‌షా ప్రచారం చేసినా ఉపయోగం లేదు. కేసీఆర్‌పై ఉన్న నమ్మకంతోనే ప్రజలు తెరాసకు విజయాన్ని కట్టబెట్టారు. దాదాపు 75 శాతం సీట్లు అందించారు.

మాకు ఇంతటి విజయం అందించిన ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం. పార్టీ, ప్రభుత్వ నిర్వహణలో, జాతీయ స్థాయిలో తెరాస ప్రభావంతమైన పాత్ర పోషించాలన్న ఉద్దేశంతో నాకు కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలను కేసీఆర్ అప్పగించారు. నేను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత 4 ఎన్నికలు చూశా. ఈ అనుభవం బట్టి క్షేత్రస్థాయిలో ఇంకా తెరాస బలోపేతం కావాల్సి ఉంది. 100 ఏళ్ల పాటు పటిష్ఠమైన పార్టీగా రూపొందించాల్సిన అవసరం ఉంది. ఓవైపు హామీలను నెరవేరుస్తూనే.. త్వరలో జరగబోయే పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కొంటూ వెళ్లాల్సిన అవసరం ఉంది. పార్టీని సమర్థంగా ముందుకు తీసుకెళ్లడమే నాముందున్న లక్ష్యం.

2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గానీ, భాజపా గానీ స్వతహాగా గెలుపొందే అవకాశం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న 17 లోక్‌సభ స్థానాల్లో 16 చోట్ల తెరాస గెలుస్తుంది. దేశ ప్రధానిని నిర్ణయించే నిర్ణయాత్మక శక్తి తెలంగాణకు వస్తుంది. తెలంగాణలో అమలౌతున్న పథకాలు దేశవ్యాప్తంగా రావాలంటే తెరాస జాతీయ రాజకీయాల్లోకి క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది అని కేటీఆర్ అన్నారు.

**2019 తర్వాత తెదేపా పాత్ర నామమాత్రమే!**

**తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**

రాష్ట్రాలు, కేంద్రం బలోపేతం కావాలన్న ఉద్దేశంతోనే ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు ప్రయత్నిస్తున్న కూటమి కేవలం తెదేపాను బలోపేతం చేసుకోవడానికేనని విమర్శించారు. 2019 ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో తెదేపా పాత్ర నామమాత్రమవుతుందన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు. కేసీఆర్ ఏర్పాటు చేసే ఫెడరల్ ఫ్రంట్ ఈ దేశంలో రాష్ట్రాల పాత్ర, బలోపేతం మీద అర్థవంతమైన చర్చకు దారితీసేదిగా ఉంటుందన్నారు. చంద్రబాబు చెబుతోన్న ఫ్రంట్ దేశం బలోపేతం కోసం కాదని, అది తెదేపా బలోపేతానికన్నారు. భాజపాను బూచిగా చూపించి తన అసమర్థతను, తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే భాజపాను ఓడగొట్టేందుకు తానేదో కూటమి తయారు చేస్తున్నానన్న ప్రయత్నాన్ని బలంగా ఏపీ ప్రజల ముందు పెట్టి తద్వారా రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు తెదేపా కోసం పనిచేస్తే.. తాము దేశం కోసం పనిచేస్తున్నామని చెప్పారు. ఈ రెండింటికీ చాలా తేడా ఉందని చెప్పారు.

# మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి



విజయనగరం : ప్రజలకోసం తమ జీవితాలను త్యాగంచేసిన మహనీయులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పురపాలక ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు అప్పయ్యశెట్టి అన్నారు. శనివారం పొట్టిశ్రీరాములు 66వ వర్ధంతిని పురష్కరించుకుని స్థానిక పురపాలక కార్యాలయంలో ఉద్యోగులు రెండునిమిషాలపాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అప్పయ్యశెట్టి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చునని పొట్టి శ్రీరాములు నిరూపించారన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి పొట్టిశ్రీరాములు ఎందరికో ఆదర్శప్రాయుడయ్యాడని కొనియాారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి టి.వి.పి.అప్పారావు, ఉపాధ్యక్షుడు అప్పలరాజు, పురపాలక మేనేజర్ ప్రసాదరావు, ఎఓ రోజా, సీనియర్ అసిస్టెంట్ భారతి తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

# రాఫెల్‌పై తీర్పు

రాఫెల్ ఒప్పందంపై ఇచ్చిన తాజా తీర్పులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య ఒకటి గమనించదగినది. మన ప్రత్యర్థులు నాలుగవ తరమే కాదు, ఐదవ తరం యుద్ధ విమానాలు తెచ్చుకున్నట్టు తెలుస్తున్నది. మనదగ్గర అవేవీ లేవు. దేశం ఈ యుద్ధ విమానాలు లేకుండా నిలువలేదు అని న్యాయస్థానం అభిప్రాయపడ్డది. రాఫెల్ ఒప్పందంలో వాణిజ్యపరమైన పక్షపాతం ఉన్నట్టు ఆధారాలు లేవని కూడా స్పష్టం చేసింది. ఒకవేళ అటువంటి అవినీతి ఆరోపణలు ఉంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. అవినీతిని అరికట్టాలనేవిషయంలో ఎవరికి భిన్నాభిప్రాయం ఉండదు. ప్రత్యేకించి రక్షణ కొనుగోళ్ళలో అవినీతిని తావుండకూడదు. రాఫెల్ యుద్ధ విమానాల కోనుగోలు ఒప్పందంలో సందేహించవలసిందేమీ లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున వల్ల వివాదం సద్దుమణగనప్పటికీ, ప్రభుత్వం ధైర్యంగా ముందడుగు వేయడానికి అవకాశం ఏర్పడ్డది. ఈ ఒప్పందంలో అక్రమాలు జరిగినందున ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసిందిగా సీబీఐకి ఆదేశాలంటూ ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ కేసులో పిటిషనర్లు లేవనెత్తిన అనేక అంశాలను ప్రస్తావించి ప్రభుత్వ నిర్ణయాధికారాన్ని న్యాయస్థానం సమర్థించింది. ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియలో సందేహించవలసిందేమీ లేదని పేర్కొన్నది. యుద్ధ విమానాలు 36 కొనాలా లేక 126 కొనాలా అనేది ప్రభుత్వ నిర్ణయం. యుద్ధ విమానం నాణ్యతపై అనుమానం లేదు కనుక, ప్రభుత్వం ఎంత పెట్టి కొంటున్నదనే లెక్కలు తీయడం న్యాయస్థానం పని కాదు. ఇందుకు సంబంధించి న్యాయస్థానం జోక్యం చేసుకునేంత ఆధారాలు లేవు. కొందరు వ్యక్తులు అవినీతి జరిగిందని అనుకున్నంత మాత్రాన సున్నితమైన రక్షణ కొనుగోళ్ళ విషయంలో జోక్యం చేసుకోవడం సబబు కాదు అని న్యాయస్థానం స్పష్టం చేసింది. డసాల్ట్ ఏవియేషన్ అనే ఫ్రెంచి కంపెనీ ప్రతిలబ్ధి నిబంధనకు అనుగుణంగా భారతీయ భాగస్వామి (రిలయన్స్ డిఫెన్స్) ఎంచుకోవడం కోసమే యుద్ధ విమానాల ధర ఎక్కువగా నిర్ణయించారనే పిటిషనర్ల వాదన కూడా నిలువ లేదు. ఈ ఒప్పందంలో వాణిజ్యపరమైన పక్షపాతం కనిపించడం లేదని న్యాయస్థానం అభిప్రాయపడ్డది. యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలోని వాస్తవాలు ఎట్లా ఉన్నప్పటికీ, రాఫెల్ ఎన్నికల యుద్ధంలో ప్రధాన అస్త్రంగా మాత్రం బాగా ఉపయోగపడ్డది. ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి తలపడ్డాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాఫెల్ ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ ప్రచారం సాగించారు. చౌకీదార్ చోర్ హై అంటూ ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి ఈ ప్రచారమే కారణమని చెప్పలేము కానీ, ఈ అవినీతి ఆరోపణలు బీజేపీని చాలా ఇరుకున పడేశాయనేది వాస్తవం. రాఫెల్ ఒప్పందంలో సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఇచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ తాను చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేశారని అంటూ, వీరికి సుప్రీంకోర్టు తీర్పు మొహంపై కొట్టినట్టుగా ఉందని అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం సుప్రీంకోర్టు తీర్పుతో ఏకీభవించడానికి కానీ, ఆరోపణలను ఉపసంహరించుకోవడానికి కానీ సిద్ధంగా లేదు. ప్రభుత్వం సుప్రీం కోర్టుకు మొత్తం సమాచారం ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ అంటున్నది. సున్నితమైన రక్షణ ఒప్పందంలోని అక్రమాలను తేల్చవలసింది న్యాయస్థానం కాదనీ, పార్లమెంటేనని తాము మొదటి నుంచి ఇదే వాదన వినిపిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా సమర్థించుకున్నారు. సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని (జేపీసీ)ని నియమించి రాఫెల్ ఒప్పందంలోని అక్రమాలపై దర్యాప్తు జరపాలని ఆయన ఇంకా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. రాజీవ్ గాంధీ హయాంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు బోఫోర్స్ అస్త్రాన్ని ప్రయోగించాయి. ఆ తరువాత అధికారానికి వచ్చిన జనతా నాయకులు బోఫోర్స్ గురించి అడిగితే, అదొక పెద్ద సమస్య కాదని, అంతకు మించిన సమస్యలు చాలా ఉన్నాయని తేలిగ్గా తీసిపారేశారు. ఆ తరువాత ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎన్ని విచారణలు జరిగినా ఒక్క దోషిని పట్టుకోవడం జరుగలేదు. కానీ దేశ రక్షణకు ఎంతో అవసరమైన బోఫోర్స్ తుపాకులను మరిన్ని కొనుగోలు చేయడం ఈ దుమారం మూలంగా ఆగిపోయింది. ఇప్పుడు రాఫెల్ ఒప్పదంపై తమ ప్రచారాన్ని ఆపడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందు వల్ల ఈ అవినీతి ఆరోపణలను మరింత ఉధృతంగా చేసినా ఆశ్చర్యం లేదు.

## అంబరాన్ని అంటిన గౌరీ పరమేశ్వరుల సంబరం



అనకాపల్లి : పట్టణంలో గవరపాలెంలో 200 ఏళ్ల చరిత్ర కలిగిన పీలా వారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం జ్యోతి ప్రజలన చేసి ఉత్సవన్ని ప్రారంభించారు. అనకాపల్లి నియోజవర్గ నాయకులు జనసేన నాయకులు కొణతాల సీతారం , రాధ దంపతులు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే పీలా గోవింద సత్య నారాయణ, డాక్టర్ కెవి. సత్యవతి , కెకెవి నారాయణ రావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఆదినారాయణ మహిళా కరస్పాం డెంట్ కొణతాల రఘునాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఘనంగా సత్కరించి, అమ్మ వారి చిత్రపటాలను బహుకరించారు. అనంతరం బుర్రకథ, డ్యాన్స్‌బేబి డ్యాన్స్, కోలాటాలు, చిడతలు, తప్పెడగుళ్ళు, సేవ గరిడీలతో బారీ బాణాసంచా, విద్యుత్ దీపాలం కరణలతో పండుగ ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్సులు అమ్మవారిఅధ్యక్ష కార్యదర్సులు భీమరశెట్టి శ్రీనివాసరావు, దొడ్డి శ్రీనివాస రావులు ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సవంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, భారీ భద్రత మద్య ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శనివారం ఉదయం గౌరీ పరమేశ్వరుల అమ్మవారిని గవరపాలెం పురవీధుల్లో ఊరేగించి, అనంతరం శారదా నదిలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

## చిరస్మరనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు

### ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రావులపాలెం : ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు వర్దంతి సందర్భముగా స్థానిక వైఎస్సార్సీపి కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి అని, సత్యం , అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహా వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఆర్యవైశ్య అధ్యక్షులు మన్యం భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క యువత శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాన్ని, దేశం కోసం చేసిన సేవలను అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోట చెల్లయ్య, జెడ్‌పిటిసి సాకా ప్రసన్నకుమార్, వైస్ ఎంపిపి దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, కర్రి నాగిరెడ్డి, గొలుగూరి మునిరెడ్డి, మన్యం సుబ్రహ్మణ్యేశ్వరరావు, మన్యం భాను, మండవిల్లి వెంకటేశ్వరరావు, మండవిల్లి నగేష్, ఎస్ చినబాబు, మన్యం పర్వత వర్ధనావు, దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీనివాస్, బొక్కా ప్రసాద్, గన్నవరపు వెంకటరావు, కర్రి గోవింద కృష్ణారెడ్డి, జక్కంపూడి లక్ష్మీనారాయణ, పువ్వల గంగాధర్, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కముజు సత్య నారాయణ, చోడపనీడి వంశి, అధిక సంఖ్యలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మార్వారీ యువమంచ్ సేవలు శ్లాఘనీయం



విశాఖపట్నం : మార్వారీ యువ మంచ్ సేవలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా వున్నాయని విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభం పాటి హరిబాబు కొనియాడారు. మార్వారీ యువమంచ్ గ్రేటర్ విశాఖ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం 36వ జాతీయ సమావేశం, లఘు ఆదినేషన్ అండ్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం వుడా చిల్డ్రన్ థియేటర్‌లో ప్రారంభమయ్యింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిధిగా ఎంపీ హరిబాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువమంచ్ ప్రతినిధులు దేశవ్యాప్తంగా ప్రజలు సేవలందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కాలిపర్స్ వస్తువులను కూడా ఉచితంగా నిరుపేదలకు అందించడం ఎంతో సంతోషకరంగా వుందని పేర్కొన్నారు. యువమంచ్ ప్రతినిధులు అంతా లాభాపేక్షకు ఆశపడ కుండా ఉచిత సేవ చేస్తున్నారని అన్నారు. సంస్థ కార్యదర్శి విద్యాశంకర్ ఖండేల్ వాల్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 10మందికి యువరత్న అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమా వేశంలో అధ్యక్షుడు హరీష్‌శర్మ, అనుజోషి, శంకర్‌లాల్ జోషి, రూపేష్‌గుప్తా, సభ్యులు గంభీర్ అగర్వాల్, కల్యాణ్ గోయల్, సంజయ్ అగర్వాల్, సందీప్ నోవాల్, రిచ్‌పాల్ శర్మ, ఓంసామి, శాంతలాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయంభూ గణపతిని దర్శించుకున్న జిల్లా జడ్జి శివకుమార్

చోడవరం : రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన చోడవరం స్వయం భూ కార్యసిద్ధి విఘ్నేశ్వరాలయానికి శనివారం జిల్లా అదనపు జడ్జి శివకుమార్ విచ్చేసారు. జడ్జి శివ కుమార్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ చేకూరి శ్రీరామ్మూర్తి రాజు జడ్జిను దుశ్శాలువా కప్పి, స్వామి చిత్రపటాన్ని అందజేసారు. ఆలయ అర్చకులు కొడమంచిలి గణేష్, చలపతి వేద మంత్రాలతో ప్రత్యేక ఆశీర్వచనములు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి వెంట స్థానిక మేజిస్ట్రేట్ పార్ధసారధి ఉన్నారు.

## సమయం కవి

### రణతంత్రమా - ఋణతంత్రమా?

రణతంత్రం ఋణతంత్రం
గుణింపుదారుల రణతంత్రం...
గరం గరంగా వస్తుంది, వరవంగా పోతుంది
ఉన్నవాడికే ఉన్నతనం, లేనివాడికి లేమితనం
సగటు మనిషికి వెర్రితనం
పంచి యిచ్చిన ఋణతంత్రం
రణాలు పెంచిన ఋణతంత్రం
రణాలు తెచ్చిన రణతంత్రం
దీపం పథకం పెట్టిననాడే దీపాలార్పిన రణతంత్రం
భాషా భేదాల్ రుచిచూపి
కులమత భేదాల్ రగిలించి
సర్వం సమానం అంటూనే కులాల కురుక్షేత్రం సృష్టించే...
ఆదిపదిలో ఆర్భాటం, రెండవ పదిలో యిరకాటం
మూడో పదిలో ముప్పుతిప్పలు
నాలుగో పదిలో నలుగులాటలు
అయిదో పదిలో అంతా శూన్యం
పన్నులు పెంచిన ఋణతంత్రం
సొమ్ములు మ్రింగిన ఋణతంత్రం
పేదరికాన్ని పెంచిన తంత్రం
వచ్చిందోయ్, వెళ్లిందోయి యీ తంత్రం
యంత్రాగారాలు పెట్టింది
తంత్రాగారాలు తెచ్చింది
వృత్తులు మూలన పెట్టింది
నెత్తికి చేతులు యిచ్చింది...
దగాకోరులు, దోపిడిదారులు
ధర్మరాజులైపోయారు
ధరలను పెంచుతూ దొరలైపోయారు
ఎందుకొచ్చిన యీ తంత్రం
ఎవడు మెచ్చిన తంత్రాలివి.
రణతంత్రం వచ్చిందోయ్
రుణతంత్రం యిచ్చిందోయ్
ఋణతంత్రం పెంచిందోయ్

...కవితా రచన
ప్రొ.అప్పాజి భగవాన్

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : నవమి రా.తె.3.01; ఉత్తరాభాద్ర రా.11.40; ఉ.వ.8.11ల 9.55

ఆదివారం 16-12-2018

a **మేషం** :ధీర్ఘకాలంగా వాయిదా పడుతూ వస్తున్న పనులు పూర్తవుతాయి. ఆది, సోమవారాల్లో కుటుంబీకులతో కలహాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. b **వృషభం** : మీ వ్యక్తిగత విషయాలు ఇతరుల ముందుకు ఏకరువు పెట్టడం మంచిది కాదని గమనించండి. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. కాంట్రాక్టు సంబంధించిన వ్యవహారాల్లో పునరాలోచన అవసరం. C **మిథునం** : ప్రైవేటు సంస్థల్లోని వారికి నిరుత్సాహం తప్పదు. హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్, వృత్తుల వారికి పురోభివృద్ధి. విద్యార్థులకు క్రీడ, కళారంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది.

## పోస్ట్‌ఆఫీస్ లో డబ్బు మాయంపై పోస్ట్ మాస్టర్ ఫిర్యాదు



అనకాపల్లి : మునగపాక మండలం తోటాడ గ్రామంలో ఉన్న బ్రాంచి పోస్ట్‌ఆఫీస్ లో లక్ష 50 వేల రూపాయల నగదు మాయం కావడం పై పోస్ట్ మాస్టర్ ఆళ్ల నాగేశ్వరరావు శనివారం సాయంత్రం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన నగదు మాయం కావడానికి ముందు పరిణామాలు వివరించారు. ఆ ప్రకారం పోస్ట్‌ఆఫీస్ ఖాతాలో 1 లక్ష 50 వేల రూపాయలు నగదు నిల్వ ఉన్న సమయంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నగదు బట్వాడా నిలిపివేయాలని ఆదేశాలు అందినట్టు చెప్పారు. ఆ ప్రకారంగానే అకౌంట్లో మిగులు చూపిస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే నగదును కూడా కార్యాలయంలోనే ఉంచానన్నారు. ఇదిలావుండగా ఈ నెల 13 వ తేదీన రాత్రి అత్యవసరమై కుటుంబంతో మచిలీపట్నం వెళ్లానని కాగా 14 వ తేదీన ఉదయం ఇనస్పెక్షన్ కు వస్తున్నట్లు ఫోన్ వచ్చిందని తెలిపారు. తాను అందుబాటులో లేనందున వాయిదా కోరగా అధికారులు అంగీకరించకపోవడంతో వారు కోరిన సమయానికి తాళాలు వేరే వ్యక్తి ద్వారా పంపినట్లు తెలిపారు. అయితే కొన్ని గంటల తర్వాత ఇనస్పెక్షన్ కు వచ్చిన అధికారి డబ్బు కనపడడం లేదని చెప్పడంతో ఆందోళనకు గురయ్యానన్నారు. పోయినది ప్రజా ధనం గనుక తక్షణ విచారణ కోరుతూ పోలీసులను ఆశ్రయించినట్టు చెప్పారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ వి. అనీష్ సమగ్ర విచారణకు హామీ ఇచ్చారు.

# సౌరాష్ట్రే సోమనాథంచ..





పరమశివుని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ప్రథమస్థానంలో వున్న సోమనాథక్షేత్రం గుజరాత్‌లో వుంది. లయకారకుడు జ్యోతిర్లింగ ఆకారంలో భక్తులకు యుగయుగాల నుంచి దర్శనమిస్తూ అభయమిస్తున్నారు. అనేక దండయాత్రలకు గురైనప్పటికీ తిరిగి పునర్ నిర్మితమైన క్షేత్రమది. సిరిసంపదలతో వున్న ఈ క్షేత్రంపైకి అనేక మంది విదేశీపాలకులు దండయాత్రలు చేశారు. చంద్రునికి శాపవిముక్తి జరిగిన క్షేత్రం కాబట్టే సోమనాథక్షేత్రంగా పేరొందింది. దక్షప్రజాపతి తన 27 కుమార్తెలను చంద్రునికిచ్చి వివాహం చేశాడు. అయితే చంద్రుడు రోహిణితో మాత్రమే సఖ్యంగా వున్నాడని మిగిలిన భార్యలు తమ తండ్రైన దక్షప్రజాపతికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన ఆయన చంద్రుడు క్షయవ్యాధితో బాధపడాలని శాపమిచ్చాడు. దీంతో భూలోకంపై వచ్చిన చంద్రుడు ప్రస్తుత క్షేత్రమున్న ప్రాంతంలో శివ విగ్రహాన్ని ప్రతిష్టించి తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై శాపం నుంచి విముక్తి కలిగించాడు. 27 సతీమణులను సరిసమానంగా చూసుకోవాలని చంద్రునికి హితవు పలికాడు. చంద్రునికి శాపవిముక్తి జరిగిన ప్రదేశం కాబట్టి సోమనాథక్షేత్రంగా పేరొచ్చింది.

చంద్రుడికి ఈ క్షేత్రంలో శాపవిముక్తి కలిగింది. దీంతో ఆయన పరమానందభరితుడై బంగా రంతో ఆలయం నిర్మించినట్టు తెలుస్తోంది. అనంతరం రావణా సురుడు వెండితో ఆలయాన్ని నిర్మించగా, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు చందనపు చెక్కలతో నూతన ఆలయాన్ని నిర్మించినట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. శివపురాణం, నంది పురాణంలో పరమేశ్వ రుడు ఇలా పేర్కొంటాడు. 'అన్ని చోట్ల నేనుంటాను. పన్నెండు ప్రదేశాల్లో మాత్రం మరింత ప్రభావ వంతంగా వుంటాను' ఈ పన్నెండు ప్రదేశాలనే ద్వాదశ జ్యోతిర్లింగాలు అని పిలుస్తారు. సాక్షాత్తు ఆ లయకారకుడు ప్రత్యక్షంగా ఈ క్షేత్రాల్లో కొలువ్కెవున్నాడు. అందుకనే ఈ క్షేత్రాలు పరమపవిత్రమైనవి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో గుజరాత్‌లోని సోమనాథ ఆలయం మొదటిది. అందుకనే ఇది మహిమాన్విత క్షేత్రమైంది. సోమనాథ క్షేత్రంలో భారీ సంపద వుండటంతో అనేకసార్లు దండ యాత్రలకు గురైంది. క్రీ.శ. 1024లో గజనీ పాలకుడ్కెన మహమ్మద్ చేసిన దండయాత్రలో ఆలయం తీవ్ర నష్టానికి గురైంది. ఆ సమయం లోనే ఆలయం నుంచి ఎక్కువ సంపదను గజనీకి తరలించినట్టు చారిత్రక గ్రంథాలు వెల్లడిస్తున్నాయి. అనంతరం స్థానిక పాలకులు తిరిగి నిర్మించారు. ఢిల్లీ పాలకుడ్కెన అల్లావుద్దీన్ ఖిల్జీ, మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాలనలోనూ ఆలయంపై దాడులు జరిగాయి. జునాగఢ్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తరువాత ఉక్కుమనిషి, భారతదేశ ప్రథమ హోంమంత్రి వల్లభాయ్‌పటేల్ ఆలయాన్ని సందర్శించి పునర్ నిర్మాణానికి ఆదేశాలిచ్చారు. 1951లో నూతన ఆలయ నిర్మాణం పూర్తయింది. భారత దేశ రాష్ట్రపతి బాబురాజేంద్రప్రసాద్ ఆలయాన్ని ప్రారం భించారు.

ఆలయాన్ని తిరిగి నిర్మించేందుకు నిధుల సేకరణ చేయకుండా కేవలం భక్తులు ఇచ్చిన విరాళాలతో నిర్మించడం విశేషం.

యుగయుగాలుగా భక్తుల కోసం కొలువ్కెవున్న సోమనాథమూర్తి తన దివ్యశక్తితో అందరిని ఆశీర్వదిస్తుంటారు.

**సౌరాష్ట్రే సోమనాథంచ...**

ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనాల్లో మొదటి లింగం సోమనాథ్‌లో వుంది. ఈ పట్టణాన్ని ప్రభాస్ పటాన్ అనికూడా పిలుస్తారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# స్థానికులకు ఉపాధి కరువైంది



మల్కాపురం : విశాఖ పట్నంలో ఏన్నో ముఖ్యమైన పరిశ్రమలు ఉన్నా వాటిలో మాజీ డిప్యూటీ మేయర్, స్థానిక వైకాపా నాయకుడు దాడి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఉపాధి సమస్యలపై రాష్ట్ర వైకాప అధ్యక్షుడు జగన్మోహనరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక యువత ఏన్నో ఇబ్బందులు పడుతున్న అదికార పార్టీ నాయకులు పట్టించుకోకుండా పరిశ్రమల యాజమాన్యనికి కొమ్ము కాస్తున్నారని, దందాలు నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నారని, నూతనంగా స్థాపించిన పరశ్రమలలో కూడా స్థానికులకు ఉపాది కల్పించకుండా ఇతర రాస్ట్రాల నుండి పనివారిని తీసుకొచ్చి స్థానిక యువత కడుపుకొడుతున్నారని అన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన జగన్మోహనరెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హమి ఇచ్చారని తెలిపారు.

# కందుకూరి రచనలపై జాతీయ సదస్సు

విశాఖపట్నం : 'కందుకూరి వీరేశలింగం రచనలు - సమాలోచన' అంశంపై ఆది, సోమ వారాల్లో రెండు రోజుల పాటు విభాగ సమావేశ మందిరం వేదికగా యుజిసి జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ఎయు విసి ఆచార్య జి నాగేశ్వరరావు హాజరవనున్నారని, కేంద్రీయ, రాష్ట్ర విశ్వ విద్యాలయాల నుంచి ఆచార్యులు, తెలుగు అధ్యాపకులు రానున్నారని వెల్లడించారు. స్త్రీ జనోద్ధారకుడైన కందుకూరి వీరేశలింగం రచనలపై రెండు రోజుల సదస్సులో ఆచార్యులు, పరిశోధకులు ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. సదస్సుకు భాషాభిమానులు, సాహితీవేత్తలు, అభ్యుదయవాదులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.



**ఏవిఎన్ కళాశాల దగ్గర ప్రేమసమాజంలో బండారు ఫౌండేషన్ ట్రస్టు ఆదినారాయణ పేరున గల పూర్తి మొత్తం ఆస్తులను ప్రేమ సమాజంనకు ట్రాన్స్‌ఫర్ చేశారు. కుష్టురోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చలపతి తదితరులు పాల్గొన్నారు.**

# అమరజీవికి సీతారాం నివాళులు



అనకాపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు 66 వ వర్ధంతి కార్యక్రమం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ నాయకులు కొణతాల సీతారాం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సీతారాం శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అమరజీవి శ్రీరాములు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఆయన త్యాగఫలం వలనే ఈ రోజు తెలుగు ప్రజలు ఇంత గర్వంగా జీవించగలుగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఉమర్, సురభి హరీష్, గల్లా వినోద్, దాడి బుజ్జి, దాడి పరదేశినాయుడు, ఐ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధంగా ఉన్నాం...తుఫాను ఎదుర్కొనేందుకు...

## జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ వెంకటరమణారెడ్డి



విజయనగరం : తుఫాను ఎదుర్కొనేందుకు అధికారులను సిద్ధం చేశామని, ముదస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చా మని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం కలక్టరేట్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16వ తేదీ మద్యాహ్నం తీవ్రరూపందాల్చే అవకాశం ఉందని అన్నారు. పూరిగిడెశలు, శిధిలావస్థగృహల్లో, సిమెంటు రేకుల ఇళ్లల్లో నివసించేవారిని పక్కాగృహాలు లేదా తుఫాను షెల్టర్లకు తరలిస్తున్నామని తెలిపారు. చేపలవేటకు వెళ్ళ వద్దని వెళ్ళినట్లైతే వెంటనే వెనక్కి పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 17 పునరావాస కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించా మన్నారు. తహసిల్దార్లు, ఎంపిడిఓలు అప్రమత్తంగా ఉండాలని ఆదేవాలు ఇచ్చామన్నారు. సముద్రతీరప్రాంత నివాసితులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, నీరు, మందులు, చిన్నపిల్లకు పాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటుచేసి అవసరమైన మందులు కూడా సిద్ధం చేశామని తెలిపారు. ఎస్.కోట, సాలూరు ప్టణాల్లో తుఫాను ప్రభావం ఉంటుందని అంచనా వేశారని తెలియజేశారు. గ్రాగునీటి సరఫర, శానిటేషన్, రోడ్లపై చెట్లు పడితే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. 14 గంటలూ ధాన్యం కొనుగోలు కేంద్రాలుంటాయన్నారు. తుపాన్‌లో సమాచార అందించేందుకు, తీసుకునేందుకు 08922-27688, పార్వతీపురంలో 08922-276713, విజయనగరం ఆర్డీఓ 08922-276888 భోగాపురం 8106668018, లేదా 77300 59392, పి.రేగలో 9398810755 నెంబర్లు సంప్రదించాలని తెలిపారు.

# అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములుకి ఘనంగా నివాళులర్పించిన

## ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది



విశాఖపట్నం : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శనివారం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ అధికారులు సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సంస్థ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.వై.దొర పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం 1952 సం॥లో 58 రోజులు పాటు నిరాహారదీక్ష చేసి, తన ఆశయ సాధనలో ప్రాణాలర్పించిన అమరజీవి అన్నారు. ఆయన ఆత్మార్పణ ఫలితంగా అణగారిని వర్గాల అభివృద్ధికి, తన జీవితాన్ని ధారపోసిన మహోన్నత వ్యక్తిగా స్వాతంత్ర్య సమరయోధుడుగా, గొప్ప సంఘ సంస్కర్తగా ఆయన నిర్వర్తించిన పాత్రను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బి.శేషుకుమార్, టివిఎస్.చంద్రశేఖర్, సిజిఎంలు కె.ఎస్.ఎన్.మూర్తి, పి.నాగేశ్వరరావు, ఓ.సింహాద్రి, పివివి. సత్యనారాయణ, వైయస్ఎన్. ప్రసాద్ మరియు కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతను చాటిచెప్పిన ఐక్య క్రిస్మస్ వేడుకలు



భీముని పట్టణము : భీమిలీ నియోజకవర్గ స్థానిక క్రైస్తవ నాయకులు మరియు స్థానిక సంఘ పాస్టర్లు ఐక్య క్రిస్మస్ వేడుకలు ఆలీవర్ రాయి ఆధ్వర్యంలో సంగివలస లో గల ఫార్చ్యూన్ స్క్వేర్ హాల్ నందు ఘనంగా శనివారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 500 మంది పాల్గొన్నారు. లవ్ అండ్ కేర్ అధినేత రెవరెండ్ బిషప్ యేసుపాదం మాట్లాడుతూ క్రీస్తు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సేవకులు అందరిని ఒక తాటిపై నిలబెడుతూ దేవునికి మహిమ కరంగా క్రిస్మస్ కార్యక్రమం నిర్వహించిన క్రైస్తవ యువ నాయకులు, ఆంధ్ర ప్రదేశ్ క్రిస్టియన్ లీడర్ ఫొరం కన్వీనర్ అయిన ఆలివర్ రాయి ని కొనియాడారు. గత సంవత్సర కాలంగా ఆలివర్ క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను అరికట్టడంలో, అన్యాయాలను ఎదుర్కొనటంలో మరియు రాష్ట్ర క్రైస్తవుల మేలు పట్ల అహర్నిశలు పాటుపడుతున్నారని కొనియాడారు. క్రైస్తవ యువ నాయకులుగా క్రైస్తవ సమాజానికి ఆయన చేస్తున్న సహాయాన్ని విషన్ నేటివ్స్ అధినేత రెవరెండ్ అర్జున్ రావు కార్య క్రమంలో గుర్తు చేశారు.సదా క్రైస్తవ సమాజం కోసం పాటు పడుతున్న ఆయన వెంట ఎల్లప్పుడూ మేమందరము ఉంటామని రాజకీయ పరిణామాలలో కూడా మీ కు మేమందరము తోడుగా ఉండి మిమ్మల్ని ముందుకు నడిపిస్తామని పలువురు వక్తలు ఆలీవర్ రాయి కి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలివర్ రాయి మాట్లాడుతూ క్రైస్తవులముగా క్రైస్తవ సమాజం పట్ల మనందరికీ పూర్తి బాధ్యత ఉందని . ప్రత్యక్ష రాజకీయాలలో క్రైస్తవులు ఉండటం అనేది క్రైస్తవ సమాజంలో మార్పు తెచ్చే గొప్ప పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు .డా.యేసు పాధం,.డా.సిహెచ్ అర్జున రావు .డా. టైటస్ ,డా.విల్సన్ బాబు, డా రవిబాబు భాస్కర్ రావు మరియు స్థానిక ఫెలోషిప్ పెద్దలు పాల్గొన్నారు.

# ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలి



విశాఖపట్నం : బోయిపాలెం సమీపంలో చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని మణికుమారి మరియు చంద్రపాలెం (మధురవాడ) పాఠశాలలో మణిదీప్ ఆత్మ హత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నాము. కార్పోరేట్ కళాశాలలో విద్యా వ్యాపారం కోసం విశ్రాంతి లేకుండా విద్యార్థులను యంత్రా లుగా చేస్తున్నారని దానివలనే ఆత్మహత్యలు జరుగుతున్నాయని అన్నారు.

ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలి. ఆత్మహత్యకు కారణమైన కార్పోరేట్ కళాశాల గుర్తింపునకు రద్దు చేయాలి. ఆత్మహత్యకు కారణమైన యాజ మాన్యంపై కేసు నమోదు చేయాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.విద్యార్థి విభాగం పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతారావు, అరకు పార్లమెంట్ అధ్యక్షులు టి.సురేష్, విద్యార్థి నాయకులు యస్.కుమార్ స్వామి, రంజిత్, పవన్, సాగర్, ప్రవీణ్, సునీల్, లీలాకృష్ణ మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మరువరాని సంకల్పం ..'మరిచర్ల' ఆదర్శం



**స్వర్గధామం - సుంకరిపేట**
**సుంకరిపేట గ్రామం, విజయనగరం మండలం, విజయనగరం జిల్లా**

విజయనగరం : దారంతా గోతులు...తన్నుకుపోతున్న రాళ్లు..కాళ్ళకు రక్తం చిమ్ముతున్నా...తప్పదు అది శవంకాదు.. బంధుత్వం..అది మరణం కాదు..రుణం దాన్ని తీర్చుకునేందుకు మహాప్రస్థానం సాగవలసిందే! చుట్టూ కంపలు... బుదమయం...పదేపదే పార్థివదేహం పడిపోతున్నాది. పెల్లుబికిన దుఖాన్ని పళ్ళ మధ్య బిగపెట్టి మరలా పాడె, కట్టి మోస్తున్నారు. ఎందరో తమ చివరిప్రయాణాన్ని ఇలా సాగించి కట్టెలయ్యారు. దుర్గంధపూరితమైన ఆ దారే స్మశానికి దిక్కు. ఆదొక్కటే చివరి దిక్కు. కుడిఎడమల పందులు..కుక్కలు అవికూడా స్మశానికి వచ్చేవి. గదామాయిస్తే కరుస్తాయన్న భయం. వాటికి తోడు వర్షం పడితే బతికున్న వారకి నరకయాతన. పోయినవారికి కర్మనుసారేనా అన్నట్టు ....ఆ శాపం ఇంతకాలం ఏ పాలకులకు తగిలిందో లేదో తెలియదు కానీ, గ్రామస్థులు మాత్రం ఈ బాధలు ఎవరూభరించలేరని భావించారు. అది విజయనగరం యండలంలో ఉన్న మలిచర్ల గ్రామం. సుంకరిపేట గ్రామానికి ఆగ్నేయంగా ఉన్న స్థలం. వెంటనే గ్రామ పంచాయితీ తీర్మానం చేసింది. ఆ దారిని బాగుచేసేందుకు అంతా నడుంకడదామని,అప్పుడు ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. దాంతో అధికారులు కదిలారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అధికారులు చిత్తశుద్ధితో పనులు మొదలుపెట్టారు. స్వర్గపురి...స్వర్గధామం పేరుతో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా సుంకరిపేటలో స్మశానాన్ని కట్టారు. నేలను పూర్తి చదును చేశారు. లెవిలింగ్ చేశారు. దహనవాటికను ఎత్తుగా వేవారు. సిసి నిర్మాణంతో ఉత్తరక్రియలకు అనువుగా మార్చారు. మూడు కాలాల్లో ఎవరు మరణించినా ఇక ఎండ, వాన, చీకటి, చలి అనే ఇబ్బంది లేకుండా సౌకర్యవంగా చివరి ప్రయాణ్నా జరిపించేందుకు గ్రామస్థులకు అనుకూలంగా మారింది. ఈపనులకు 9.14 లక్షలు అవపరం అయ్యాయి. కానీ 1.96 లక్షలు వేతనంగా 7.17 లక్షలు వస్తు సామగ్రిగా ఖర్చు అయింది. ఉపాధి హామీ నిధులతో దహన వాటికి, నిరీక్షణ, దుస్తులు మార్చిడి గదులు ముఖద్వారం (12 మీటర్లు పొడువు, కాంపౌండ్‌వాల్ నాణ్యతా ప్రమాణాలతో నిర్మించారు.గ్రామపంచాయితీ 2.10 లక్షల వస్తు, వేతన రూపేణా చెల్లింపు చేసింది. ఇంకా 9.5.లక్షల నిధులతో 27 మీటర్ల కాంపౌండ్ వాల్ నిర్మించింది. సోలార్ విద్యుత్ సౌకర్యం కల్గించింది. 40 మొక్కలు నాటి ఫలసాయాన్ని, నీడని కూడా అందిస్తోంది. సుందరీకరణతో ఇది స్వర్గధామంలా కాకుండా ఒక ఉద్యానంలా ఉంటుంది. 10 సిమెంట్ బెంచీలు. ఇన్ని పనులు ముందుగా బుజాన వేసుకుంది సర్పంచ్ సుంకరి సన్యాపమ్మ, ఆమె భర్త రామునాయుడు. వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామస్థులు నడుం బిగించారు.

ఈ స్మశానవాటికి నమూనా కూడా ఆదర్శమైంది. సుమారు 15 గ్రామ పంచాయితీలకు స్మశానవాటికలకు ఇదే నమూనా ఆమెదయోగ్యమైంది. అందులో 8పంచాయితీలలో వాటికలు నిర్మాణదశలో ఉన్నాయి. చివరి నడక..ఎవరికోసం...భగవంతుని దగ్గరకు ప్రశాతంగా వెళ్ళనివ్వరా? అని శవం ప్రశ్నించకపోవచ్చు. కానీ...సమాజం మౌనం వహించదుగా..అదే వారి సంకల్పానికి ప్రేరణ అయింది.

# నేడు కళాకారుల పిక్నిక్‌ను

## విజయవంతం చేయండి

విశాఖపట్నం : విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే వనభోజనాల (పిక్నిక్)లో కళాకారులంతా హాజరు కావాల్సిందిగా సంఘం అధ్యక్షులు కె. జనార్ధన్ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కె.జనార్ధన్ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం, నాటకం, గానం తదితర అంశాలకు చెందిన కళాకారులు, కళాసంస్థల ప్రతినిధులు 16న ఉదయం 9 గంటలకు ముడసర్లోవ పార్కులో ఏర్పాటు చేసిన పిక్నిక్ స్పాట్‌కు హాజరు కావాలని కోరారు. ఇందులో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేసామన్నారు. పిక్నిక్‌లో మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపి అవంతి శ్రీనివారావు, వైకాపా నగర అధ్యక్షులు డా॥ మళ్ల విజయప్రసాద్‌లతో పాటు సినీ, ప్రభుత్వ, రాజకీయ ప్రముఖులు హాజరు అవుతారన్నారు. ఆసక్తి గల కళాకారులు మరిన్ని వివరాలకు 9848068536 సెల్ నెంబర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

# అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు ఘనంగా సీమంతాలు



మల్కాపురం : జి.వి.ఎం.సి 49వ వార్డు హరి జనవీదిలో గల అంగన్‌వాడి కేంద్రంలో స్థానిక గర్భిణి మహిలలకు శ్రీమంతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 49వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్ ముఖ్య అతిదిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా వార్డులోని పలువురు మహిళ లకు శ్రీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన పూర్వ జన్మ సుకృతం అని, ప్రభుత్వం గర్భిణి మహిళల కోసం ఏన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని అన్నారు.

కో-ప్రొడ్యూసర్స్ కావలెను
త్వరలో మేము ప్రతిష్టాత్మకంగా నిర్మించబోవు మల్టీస్టార్ చిత్రానికి
సహాయ నిర్మాతలు కావలెను
95532 45023
95819 91533

# సీపీఐ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయండి

## - జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ

చోడవరం : ఈ నెల 18 నుండి 22 వరకు విశాఖలో జరగనున్న భారత కమ్యూనిష్టు పార్టీ (సి.పి.ఐ) జాతీయ సమావేశాలను జయప్రదం చేయవలసిందిగా అనుబంధ కార్మిక సంఘాలకు జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. చోడవరం సి.పి.ఐ కార్యాలయంలో జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు అధ్యక్షతన శనివారం అనుబంధ కార్మిక సంఘాల వారితో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కార్యదర్శి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బూర్జువా రాజకీయ పార్టీలు తమ రంగులు మార్చుతున్నాయని తెలియజేసారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ స్వార్ధ రాజకీయాలతో ప్రజలను మభ్యపెడుతున్న బూర్జువా నాయకులకు తగిన గుణపాఠం చెప్పేందుకు సి.పి.ఐ జాతీయ నాయకుల ఐక్య కార్యాచరణ ఉంటుందని తెలియజేసారు. పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల తరపున అనేక పోరాటాలు చేస్తూ వారి తరపున నిలబడుతున్న సి.పి.ఐ.కు ప్రజాదరణ ఎప్పుడూ ఉంటుందన్నారు. జాతీయ సమావేశాల అనంతరం ఈ నెల 21, 22 తేదీల్లో విశాఖ మహా నగరంలో భారీ ర్యాలీ, ప్రదర్శన ఉంటుం దని తెలిపారు. మరిన్ని ప్రజా పోరాటాలకు కమ్యూనిష్టు పార్టీ జాతీయ నాయకులు దిశ నిర్దేశాన్ని సూచిస్తారని తెలియజేసారు. ప్రజాస్వామ్యం పేరుతో రాజకీయం చేస్తున్న దళారీ నేతలకు జాతీయ సమావేశాలు చెంప పెట్టు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి నేమాల హరి, కళాసీల సంఘం అధ్యక్షుడు కిల్లి లక్ష్మయ్య, మోటారు కార్మికుల సంఘం నాయకులు బొబ్బిలి శంకర్రావు,



పెయింటర్ల సంఘ అధ్యక్షుడు నేమాల నర్సింగరావు, వివిధ కార్మిక, కర్షక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

2019 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్ కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749,

# జగన్ సీఎం అయితే నవరత్నాలతో లబ్ధి

## వైసిపి సమన్వయకర్త యు వి రమణమూర్తి రాజు



అచ్యుతాపురం : జగన్ సీఎం అయితే నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని యలమంచిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబు) అన్నారు. శనివారం మండలం లో దొప్పెర్ల , గొర్లెదర్మవరం గ్రామాలలో ఆయన వైసిపి యువనాయకులు మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార్ వర్మ (తేజ) తో కలిసి రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి నవరత్నాలను వివరిస్తు కరపత్రాలను పంపిణి చేసారు . ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా రూరల్ యువజన అద్యక్షులు లాలం రాంబాబు (రాము) ,దొప్పెర్ల మాజీ సర్పంచ్ కొరుపోలు చిన్నరావు ,మండల పార్టీ అద్యక్షులు మారిశెట్టి సూర్యనారాయణ ,ద్వారాపురెడ్డి బాబ్జి ,నర్మాల కుమార్ ,వడిశల శ్రీను మండల యువ జన అద్యక్షులు గండిబోయిన వెంకట్ ,వాసుపల్లి శ్రీనివాసరావు ,చేపల శ్రీరాములు ,దేశంశెట్టి శంకరరావు ,బలిరెడ్డి శ్రీను అదిక సంఖ్యలో నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు .

# భయం గుప్పిట్లో ప్రజలు

## ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి మల్లాడి, పరిపాలనాధికారి

యానాం: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంవలన తీర ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో కొట్టుమిట్టాడు తున్నారు. కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో పెథాయ్ తుఫాను పొంచి ఉందని అధికారులు ఇచ్చిన ప్రకటనలకు విశాఖ, కాకినాడ మధ్య తీరందాటే అవకాశాలు ఉన్నాయని తెలియటంతో ప్రజలు భయ బ్రాంతులకు గురవుతున్నారు. 1996 నవంబర్ 6న సంభవించిన పెనుతుఫాను ప్రభావంవలన తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో అది పునావృత్తం అవుతాదేమోనన్న భయం ప్రజలను వెంటాడుతుంది, ఇప్పటికే తీరం వెంబడి అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేయడం భారీ వీదురు గాలులు వీస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం పరంగా ప్రకటనలు జారీచేయడం వరకు జరుగుతుందని సహాయ కార్యక్రమాలు ఎంతవరకు అందుతాయనేది వేచిచూడవలసి ఉంటుందని తీరప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఎన్ఆర్ఎఫ్ సహాయక బృందాలు తీర ప్రాంతాలలో ఏర్పాటుచేయనున్నట్లు పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు. పుదుచ్చేరినుండి యానాం చేరిన మంత్రి మల్లాడి క్రిష్ణారావు హుటాహుటిని యానాం పరిపాలనాధికారి కార్యాలయానికి చేరుకొని తుఫాను సహాయక కార్యక్రమాలపై చేస్తున్న పనులను పరిపాలనాధికారిని అడిగి తెలుసుకున్నారు. తీసుకోవలసిన అంశాలపైన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయక కార్యక్రమాలు చేసేం దుకు ఏర్పాట్లు ముమ్మరం చేసి అప్రమత్తంగా అధికారులు ఉండాలన్నారు. తుపాను ప్రభావం వలను పెనుగాలులు, భారీ వర్షాలు వచ్చే టప్పుడు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లుచేయాలన్నారు. తీరం దాటేటప్పుడు ఎవరు ఇళ్ళ నుండి బయటకు రాకుండా ఉండాలని సూచనలుచేసారు. అనంతరం తీరప్రాంతాలైన సావిత్రినగర్, గిరియంపేట, దరియాలతిప్ప దుమ్మేటివారిపేట, పరంపేట, ఆయ్యన్ననగర్, కురసంపేటలలో పర్యటించి ప్రజలకు అధికారుల సూచనలను పాటించాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు. మంత్రి వెంట అధికారుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఎటువంటి పరిస్థులైన ఎదుర్కొనుటకు సిద్ధం

## – జిల్లా కలక్టర్



అమలాపురం: ఫెదయా తూఫాన్ ఎటువంటి పరిస్థులైన ఎదుర్కోనుటకు సిద్ధం. అని జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌డిఓ కార్యలయంలో అధికారులతో సమావేశం జరిపారు. ఈ తుఫాన్ జిల్లాలో తీరం దాటే అవకాశం ఉన్నట్లు అన్నారు. తీరం ఎక్కడదాటుతుందో పూర్తిగా అంచనా వేయలేక పోతున్నామన్నారు. తీరందాటే సమయంలో 90 కిలోమిటర్ల వేగంతో గాలులు విస్తాయని ఈ రాత్రికి ఎక్కడ దాటుతుందో అంచనా తెలియ వచ్చున్నారు. కోనసీమలో 50 పునరావాసాలు ఏర్పాటు చేసామన్నారు. తిత్తిలి తుఫాన్ పనిచేసిన నల్గురు ఐ.ఎ.ఎస్ అధికారులను ఇక్కడ నియమించామన్నారు. ప్రజల కు కావలసిన నిత్యవసర సరుకులు ఉన్నాయని కమ్యూనికేషన్ అందు బాటులో ఉండేల సెల్‌టవర్లు వద్ద జనరేటర్ల ఉంచామన్నారు. సోమ, మంగళ వారాలు పాఠశాలలకు శెలవు ప్రకటిం చారు. జిల్లాలో ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎస్.టి.ఆర్.ఎఫ్ బృందాలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. తుఫా నును ఎదుర్కొవాడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. కలక్టర్ వెంట జాయింట్ కలక్టర్ మల్లికార్జునరావు, రాజమండ్రి సబ్ కలక్టర్ సాయికాంత్ వర్మ, రంపచోడవరం సబ్ కలక్టర్ వినోద్‌కుమార్, చింతూరు ఐటిడి ప్రొజక్టర్ అధికారి అభిషేక్ వర్మ, అసిసెంట్ కలక్టర్ జ్ఞానచంద్ర, జాయింట్ కలక్టర్ 2 ఆర్.సత్తి బాబులు ఉన్నారు.

# రాజ్యాధికార దిశగా ముందడుగేద్దాం



రాజమండ్రి: బహుజనులంతా ఐక్యతతో చైతన్యవంతులై రాజ్యాధికారం దిశగా ముందడు గు వేయాలని అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్, ఏపీస్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు న్యాయవాది బైపా అరుణ్ కుమార్ అన్నారు.

ఎఎఎఫ్ ఆధ్వర్యంలో రాజమండ్రి సుబ్రహ్మణ్యం మైదానంలో ఎస్సి, ఎస్టీ శక్తి ప్రదర్శన బహిరంగ సభ శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన బైపా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికైనా బహుజనులంతా మేల్కొని రాజకీయ బానిసత్వం నుంచి విముక్తి పొందే క్రమంలో ఉద్యుక్తులు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి హర్షకుమార్, ఎఎఎఫ్ అధ్యక్షుడు పినిపె వెంకట రామకృష్ణ, న్యాయవాదులు వై. జయరాజు, కదిరి రాము, కర్రి ఆదిబాబు, కెవిఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# కోరంగి ఎస్ఐగా హరిష్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

తాళ్లరేవు: కోరంగి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా జి. హరిష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన సుమంత్ పలు వివిధాల కారణంగా విఆర్‌పై వెళ్ళడంతో నూతన ఎస్ఐగా ఈయన నియమితులయ్యారు. నందిగాం మండలం కంచికర్ల గ్రామానికి చెందిన హరిష్‌కుమార్ 2012 బ్యాచ్‌కు చెందిన వారు. ఇప్పటివరకు జి.గన్నవరం, అమలాపురం, కొత్తపేట, కాకినాడలలో పనిచేసి ప్రస్తుతం కోరంగి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

# నవోదయకు 515 దరఖాస్తులు

యానాం: జవహర్ నవోదయ విద్యాలయాలలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా 515 మంది దరఖాస్తు చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ ఎం. అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారంతో గడువు ముగియండంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఫేస్ 1లో పూర్తిచేసుకొని రిజిస్టర్ నెంబర్ పొంది ఫేస్ 2లోకి ప్రవేశించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పూర్తిచేసేందుకు ఈ నెల 17 ఆఖరుతేది అన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్థానిక వాహనాల వీధిలో ఉన్న పొటి శ్రీరాములు విగ్రహనికి ముందుగా వాసవి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరహర దీక్ష చేసి ప్రాణాలను అర్పించిన మహనీయుడని, అటువంటి వ్యక్తిని స్మరించడం మన కర్తవ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ బొలిశెట్టి. రమేష్, బోనగిరి.శ్రీనివాస్, దాసరి.మురళి, నేతి.బాబి, లక్ష్మణ్, రాము, కె.సతీష్, కేదారశెట్టి. రాంబాబు, రాజా, రామ్ కుమార్, నేతి.మమత, వరలక్ష్మి, రాధ, సత్య, పార్వతి, చంద్రావతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# రేపే స్టేట్ గవర్నమెంటు పెన్షనర్స్ డే

యలమంచిలి: అఖిలభారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఈ నెల 17వ తేదీన స్థానిక యన్.జి.వోస్ హోమ్‌లో నిర్వహిస్తున్నట్టు స్టేట్ గవర్నమెంటు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్. సోమేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 75 సంIIలు నిండిన సభ్యులకు సన్మాన కార్యక్రమము నిర్వహింస్తున్నారని అన్నారు. అలాగే ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిధిగా ఎస్‌టివో కె. జోగినాయుడు, అతిధులుగా టి. సూర్యశేఖర్, ఆర్. శ్రీనివాస్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమమునకు సభ్యులందూ హాజరై సభను జయప్రతం చేయాలని కోరారు.

# విశాఖదక్షిణంలో చురుగ్గా సాగుతున్న టిడీపీ సభ్యత్వ నమోదు



విశాఖపట్నం: విశాఖదక్షిణం, 23వ వార్డులో టిడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సారధ్యంలో గంటలోనే 900 మంది సభ్యత్వాలు తీసుకోవడం గమనార్హం. కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లోని వ్యాపారస్తులు, స్థానికులు స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బంగారి రవిశంకర్, ఈశ్వరమ్మ, గుణవతి, త్రినాద్, బంగారి సత్యం, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



కెజిహెచ్‌లో చికిత్సపొందుతున్న 29వ వార్డు మాజీ కార్పొరేటర్ చంద్రమ్మ భర్త అప్పారావును ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పరామర్శించి స్వంత నిధులు రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అతడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగితెలుసుకున్నారు. అందోళన చెందవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి

అనంతపురం : నూతన పింఛన్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని అఖిల భారత తపాలా, గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం పీ 4 రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను అమలులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ అఖిల భారత తపాలా, గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘ నాయకులు నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు కమలేష్ చంద్ర కమిటీ సానుకూల సిఫారసులను తక్షణం అమలు చేయాలని ఉద్యోగులు కొంత కాలంగా ఉద్యమిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణ మన్నారు. దేశవ్యాప్తంగా 25వేల పోస్టుమాన్ ఉద్యోగ ఖాళీలు తక్షణం భర్తీ చేయాలని కోరారు. ఇంటి అద్దె బకాయిలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందరెడ్డి, కిశోర్ కుమార్, రాఘవేంద్ర ప్రసాద్, క్రిష్ణయ్య యాదవ్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, శివకుమార్, తిమ్మయ్య, మధు, రాజు, నల్లప్ప, రాంప్రసాద్ పాల్గొన్నారు.

# వైయస్ఆర్ సీపీ ఆద్వర్యంలో ఘనంగా పొట్టిశ్రీరాముల వర్ధంతి వేడుకలు



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో అమరజీవి పొట్టి శ్రీములు యొక్క వర్ధంతి కార్యక్రములను స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక వాహనాల వీధిలో ఉన్న పొట్టి శ్రీరాములకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం సుమారు 58 రోజులు ఆమరణ దీక్ష చేసి ప్రాణాలను త్యాగము చేసిన మహనీయుడని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో బిఎస్వీ ప్రసాద్, తాటిపాక.కృష్ణ, బత్తుల. రవికుమార్, పలివెల.కొండలరావు, ధారా .వెంక టరమణ, అల్లాడ. సూరిబాబు, ఆర్లి.సూరిబాబు, బండారు. అర్జునరావు, దాసరి.అజయ్ తదితరు లు పాల్గొన్నారు.

# తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎమ్మార్వో పోతురాజు

కాజులూరు: మండలంలోని ఉన్న ప్రజలం దరూ తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మార్వో పోతురాజు కోరారు. ఫెథాయ్ తుఫాన్ ఎక్కువ ప్రమాదకరంగా ఉండబోతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ తుఫాను బారినుండి కాపాడుకోవాలని అన్నారు.

ఈ రోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూరి గుడిసెల్లో రేకు షెడ్లలో ఉండేవారు పటిష్ట బిల్డింగులకు చేసుకోవాలన్నారు. అధికంగా గాలులు వేయడం వలన విద్యుత్ సరఫరా నిలిచిపోవచ్చు నని, దానికి తగిన ఏర్పాట్లు చేసు కోవాలన్నారు. ఎక్కువగా గాలులు వీచేటప్పుడు ఎత్తయిన చెట్లు దగ్గర నిలువ పడకూడదని కోరారు.

వాతావరణ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం గాలులు బలంగా వీస్తాయని చెప్పారు. అన్ని గ్రామాల విఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు మరియు మండల అధికారులు గ్రామ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని వారిని ఆదేశించారు.

# పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా సబ్ సెంటర్ల ఆధునీకరణ

## – గ్లోబల్ సదస్సులో మంత్రి మల్లాడి

యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) ఆధునీకరణకు అన్నిన ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నంలో జరుగుతున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ ఫోరమ్ ఆన్ మెడికల్ డివైసెస్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం సబ్ సెంటర్లలో ఏఎన్ఎం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారని అయితే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఒక డాక్టర్, ఒక స్టాఫ్‌నర్స్‌ను కూడా విధులు న్విహించేలా చర్యలు తీసుకోవాలని, సబ్ సెంటర్లను ఆధునీకరిం చాలని కోరడం జరిగిందన్నారు. దేశంలోనే సబ్ సెంటర్లలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందించే విధంగా పుదుచ్చేరి నిలుస్తుందని మంత్రి మల్లాడి అన్నారు. ఈ మేరకు పుదుచ్చేరిని ప్రకటించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తుంద న్నారు. ఈ రెండు అంశాలను కేంద్ర ఆదీనంలో గల జిప్‌మేర్ ఆసుపత్రికి అనుసంధానం చేయాలని, యానాం, పుదుచ్చేరి జిప్‌మేర్ మద్య ఒక కన్సల్టెంట్‌ను ఏర్పాటుచేయాలని కోరడం జరిగిందని దీనికి కూడా త్వరలోనే జివో విడుదల చేయనున్నట్లు కేంద్రం అంగీకరించిందన్నారు.

# కేంద్ర నిధుల్ని రాష్ట్రప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది

## – రాష్ట్ర కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి భక్తసాయిరామ్



యలమంచిలి: రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పనుల్ని ఎండగడుతోందన్న భయంతో కేంద్రం లోని బిజెపి ప్రభుత్వంపై తెలుగుదేశం చిల్లర ఆరోపణలు చేస్తోందని బిజెపి రాష్ట్ర కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి గొత్తిన భక్తసాయిరామ్ రాష్ట్ర ప్రభుత్వని దుయ్యబట్టారు. శనివారం యల మంచిలిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగిం చారు. కేంద్ర పంపిన సొమ్మును రాష్ట్రానికి వాడుకుంటూ తమ ప్రభుత్వ కార్యక్రమాలుగా తెలుగుదేశం ప్రచారం చేసుకుంటోందన్నారు. అందుకే తాము ఇంటింటికీ బిజెపి కార్యక్రమం రూపొందించామని అన్నారు. అసెంబ్లీ నియోజక వర్గంలో ప్రచారం చేస్తున్నామన్నారు. క్రమశిక్షణ కు మారు పేరైన బిజెపి అంత్యోదయ పథకాన్ని అమలు చేయడమే ధ్యేయంగా పనిచేస్తాం దన్నారు. అంత్యోదయం ముఖ్య సూత్రం దేశంలోని అట్టడుగు వ్యక్తికి పథకం ఫలాలు అందించడమే ముఖ్యమన్నారు. కార్యక్రమం బిజెపి జిల్లా కార్యదర్శి పప్పు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది.

కార్యక్రమంలో పొన్న గింటి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతోన్న కేంద్రప్రభుత్వాల మండలం, శాసనసభా నియోజకవర్గాంలో ఈ నెల ఒకటవ తేదినుంచి జరుగుతున్నామన్నారు, గ్రమాల్లో మంచి ఆదరణ కనపడుతోందన్నారు. కొందరు బిజెపికి కార్యక్రమాలవైపు ఆకర్షిలవుతూ పార్టీ సభ్యత్వం కూడా తీసుకుంటున్నారని వివరించా రు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ రాజా సన్యాసినాయుడు, అసెంబ్లి ఇన్‌ఛార్జి పాలపాటి రవిరాజు, పట్టణ అధ్యక్షుడు పిట్టా దాసుబాబు, పార్లమెంట్ సోషల్‌మీడియా కన్వీనర్ రంగారవి, ర్రాష్ట కౌన్సిల్ సభ్యుడు గుర్రాల నగేష్, అసెంబ్లి మీడియ ఇన్‌ఛార్జి మేరుగు కాసుబాబు పాల్గొన్నారు.

# లలితకళలు మానసిక వికాసాన్ని అందిస్తాయి



విశాఖపట్నం: విద్యతోపాటు మానసిక వికాశాన్ని అందించడానికి లలిత కళలు దోహద పడతాయని ప్రముఖ విద్యావేత్త, ఆంధ్ర విశ్వకళా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పేరి శ్రీనివాస్ అన్నారు. శ్రీరామ చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న చిల్డ్రన్ ఫెస్టివల్ 2018 శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలల సంక్షేమానికి ట్రస్టు నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రముఖ విద్యావేత సీఎల్ రావు, జాతీయ పర్యావరణ శాస్త్రవేత్త పీవీఆర్ విఠలమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సాహించాలన్నారు. 36 అంశాల్లో జరిగిన ఈ పోటీలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుండి సుమారు 12 వేల మంది చినారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ తెన్నేటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. కోశాధికారి వేదల సోమేశ్వరరావు వందన సమర్పణ చేశారు.

# చిత్రభాను

# భీ భీ.... రణవీర్‌తో పెళ్లి తర్వాత ఆ ప్రశ్న వేయగా!



బాలీవుడ్ ప్రేమ జంట దీపిక పదుకోన్, రణవీర్ సింగ్ వివాహం నవంబర్ 14, 15 తేదీల్లో ఇటలీలోని లేక్ కోమోలో వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. కొంకణి, సింధి సాంప్రదాయాల్లో వీరి వివాహ వేడుక జరిగింది. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన జ్ఞాపకాలు ఇంకా అభిమానుల కళ్లముందు కదలాడుతూనే ఉన్నాయి.

పెళ్లి తర్వాత కూడా దీపిక పదుకోన్ సినిమాల్లో కంటిన్యూ కాబోతున్నారు. అది ఓకే కానీ... చాలా మందిలో ఓ సందేశం ఇంకా అలానే ఉండి పోయింది. వివాహం తర్వాత తెరపై వేరే హీరోలతో ముద్దు సీన్లు చేస్తారా? అనే? ప్రశ్నకు దీపిక విచిత్రంగా రియాక్ట్ అయ్యారు. తాజాగా ఓ మేగజైన్ ఇంటర్వ్యూలో దీపిక పాల్గొనగా "పెళ్లి తర్వాత మీరు చేయబోయే సినిమాల కాంట్రాక్టుల్లో నో కిస్సింగ్ క్లాజ్ ఉంటుందా? అనే ప్రశ్న ఎదురైంది. దీనికి వెంటనే 'ఛీ...' అంటూ రియాక్ట్ అయ్యారు దీపిక. ఆమె రియాక్షన్ చూస్తుంటే ఇకపై ముద్దు సీన్లు చేయబోదని స్పష్టమవుతోంది.

హనీమూన్ వాయిదా రణవీర్, దీపిక పెళ్లి అయింది కానీ... ఇంకా హనీమూన్ వెళ్లలేదు. అందుకు కారణం వారి ప్రొఫెషనల్ కమిట్మెంట్సే. ఈ విషయమై దీపికను ప్రశ్నించగా... ప్రస్తుతం రణవీర్ ప్రొఫెషన్ పరంగా బిజీగా ఉండటతో ఇంకా దాని గురించి ఆలోచించలేదని, త్వరలోనే ప్లాన్ చేసుకుంటామని తెలిపారు.

రణవీర్ సంగ్ రణవీర్ సింగ్ ప్రస్తుతం రోహిత్ శెట్టి దర్శకత్వంలో నటించిన 'సింబా' మూవీకి సంబంధించిన ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా విడుదల తర్వాత రణవీర్, దీపిక హనిమూన్ వెళ్లే అవకాశం ఉంది. దీపిక పదుకోన్ దీపిక పదుకోన్ త్వరలో మేఘనా గుల్జార్ దర్శకత్వంలో తెరకెక్కబోయే చిత్రంలో నటించబోతోంది. యాసిడ్ ఎటాక్‌కు గురైన లక్ష్మి అగర్వాల్ జీవితంగా ఆధారంగా ఈ సినిమా ఉండబోతోంది. ఈ చిత్రం ద్వారా దీపిక నిర్మాతగా మారుతుండటం విశేషం.

### మగాళ్లు భ్రమ పడుతుంటారు..

# నటి ఘాటుగా!



హీనా ఖాన్ బుల్లితెర భామ అయినప్పటికీ బాలీవుడ్ తరాలకు సమానమైన అందంతో యువతలో క్రేజ్ తెచ్చుకుంది. హీనా ఖాన్ సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో యువతకు చేరువైంది. హీనా ఖాన్ చేసే ఫొటో షూట్స్ మతి పోగొట్టేలా ఉంటాయి. ఇక బిగ్ బాస్ 11 షోలో పాల్గొన్న తర్వాత హీనాఖాన్ క్రేజీ సెలబ్రిటీగా మారిపోయింది. ఎలాంటి విషయం గురించి అయినా హీనా ఖాన్ ఘాటైన వ్యాఖ్యలు చేయడానికి తడబడదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పోర్న్ గురించి మాట్లాడి సెగలు రేపింది. హీనా ఖాన్ తాజా ఇంటర్వ్యూలో తన మనసులోని అభిప్రాయాలని బయట పెట్టింది. మగాళ్లలో మీకు సెక్సీగా అనిపించేది ఏది అని ప్రశ్నించగా.. హీనా ఖాన్ వారి తెలివి అని తెలిపింది. ఓ అబ్బాయి తెలివైన వాడు అయితే ఫిజికల్ గా ఇలా ఉన్నా పరవాలేదు. ఎందుకంటే అతని తెలివితేటలతో తనని తాను ఎలా మలచుకోవాలో తెలుస్తుంది.

అందువలనే తాను తెలివైన వారిని ఇష్టపడతానని హీనా ఖాన్ తెలిపింది. తొలిసారి పోర్న్ చూసినప్పుడు తొలిసారి పోర్న్ చిత్రాలు చూసినప్పుడు ఎలా ఫీల్ అయ్యారు అనే ప్రశ్నకు హీనా ఖాన్ తడుముకోకుండా సమాధానం ఇచ్చింది. పోర్న్ గురించి ఇక చెప్పేదేముంది.. గుడ్లప్పగించుకుని చూశా అని హీనా ఖాన్ తెలిపింది. హీనా ఖాన్ ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో పలు సందర్భాల్లో హీనా ఖాన్ ఇలాంటి బోల్డ్ స్టేట్ మెంట్స్ ఇచ్చింది. అలా భ్రమ పడుతుంటారు మహిళలు మగాళ్ల వద్ద దాచాలనుకునే విషయం ఏంటి అని ప్రశ్నించగా.. అబ్బాయిలకంటే అమ్మాయిలకే సీక్రెట్స్ ఎక్కువగా ఉంటాయి. చాలా సీక్రెట్స్ అమ్మాయిలు బయటకు చెప్పరు. చెప్పకపోవడమే మంచింది. కానీ అబ్బాయిలు మాత్రం తాము అమ్మాయిలని బాగా గమనిస్తున్నామని భ్రమపడుతుంటారని హీనా ఖాన్ తెలిపింది. వాస్తవానికి అమ్మాయిల కళ్ళుగప్పి అబ్బాయిలు ఏపని చేయలేరు. వాళ్లకు అన్నీ తెలిసిపోతుంటాయి అని హీనా ఖాన్ తెలిపింది. తొలి బాలీవుడ్ చిత్రంలో హీనా ఖాన్ పలు టివి షోలతో బిజీగా గడుపుతోంది. అదేవిధంగా తన బాలీవుడ్ డెబ్యూ మూవీలో కూడా నటిస్తోంది. హీనా ఖాన్ ఈ చిత్రంలో కాశ్మీరీ అమ్మాయిగా నటిస్తుండడం విశేషం. టైటిల్ ఇంకా ఖరారు కాని ఈచిత్రం లేడి ఓరియెంటెడ్ కథతో తెరకెక్కుతోంది. సిటీ లైఫ్, టెక్నాలజీ లాంటి అంశాలతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

# రాంచరణ్ సంక్రాంతికి.. బాలయ్య దసరాకి!





నందమూరి బాలకృష్ణ ఎన్టీఆర్ బయోపిక్ చిత్రంతో బిజీగా ఉన్నాడు. క్రిష్ జాగర్లమూడి దర్శత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. బాలయ్య రాజకీయాల్లో బిజీగా ఉంటున్నా సినిమాల జోరు మాత్రం తగ్గించడం లేదు. కుర్రాళ్లతో పోటీ పడుతూ సినిమాలు చేస్తున్నాడు. ఎన్టీఆర్ బయోపిక్ చిత్రం తరువాత బాలయ్య నటించే సినిమాల గురించి ఆసక్తికర వార్తలు వస్తున్నాయి. వివి వినాయక్ దర్శత్వంలో, బోయపాటి దర్శత్వంలో అంటూ ప్రచారం జరుగుతోంది. బాలయ్య, బోయపాటి శ్రీను కాంబినేషన్ అంటే నందమూరి అభిమానుల్లో ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోవడం ఖాయం. ఎందుకంటే వీరిద్దరి కాంబినేషన్ లో సింహా, లెజెండ్ అనే సూపర్ హిట్ చిత్రాలు వచ్చాయి. ఎలాంటి సింహా ముందు వరకు బాలయ్య నటించిన చాలా చిత్రాలు నిరాశపరిచాయి. కానీ బోయపాటి సింహా చిత్రంలో బాలయ్యని పవర్ ఫుల్ గా ప్రెజెంట్ చేసి నందమూరి ఫ్యాన్స్ ని ఖుషి చేశాడు. ఆ తరువాత వచ్చిన లెజెండ్ చిత్రం కూడా సూపర్ హిట్ గా నిలిచింది. వినయ విధేయ రామ ప్రస్తుతం బోయపాటి శ్రీను మెగా పవర్ స్టార్ రాంచరణ్ తో వినయ విధేయ రామ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రెండు పాటల మినహా వినయ విధేయరామ చిత్రం షూటింగ్ మొత్తం పూర్తయింది. ఈ చిత్రం విడుదల తరువాత బోయపాటి తీరిక పడనున్నాడు. ఆ తరువాత బాలయ్యతో తెరకేకించే చిత్రంపై ద ృష్టి పెడతాడని సమాచారం. మార్చి నుంచి ఇప్పటికే బాలయ్య కోసం సిద్ధం చేసి ఉన్న కథకు తుదిమెరుగులు దిద్ది మార్చి నుంచి సినిమాని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఆ లోపు బాలయ్య నటిస్తున్న ఎన్టీఆర్ బయోపిక్ రెండు భాగాలూ విడుదలైపోతాయి. హీరోలని పవర్ ఫుల్ గా చూపించడంలో బోయపాటి శ్రీను ఆరితేరిపోయారు. ఆయన సినిమాలన్నీ గమనిస్తే ఊరమాస్ అనిపించే యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. మాస్ ప్రేక్షకులు బోయపాటి చిత్రాలని ఇష్టపడేది అందుకే. దసరా కానుకగా బోయపాటి శ్రీను తన చిత్రాల్ని వేగంగా చిత్రీకరిస్తారు. మార్చిలో బాలయ్య చిత్రాన్ని మొదలు పెట్టి దసరాకు విడుదల చేయాలనేది ప్లాన్. ఈ చిత్రంలో బాలయ్య సరసన నటించే హీరోయిన్లు ఎవరు.. సంగీతం దర్శకుడు లాంటి విషయాలన్నీ త్వరలో తెలియనున్నాయి. బహుశా వినయ విధేయరామ చిత్రం విడుదలయ్యాక ఈ చిత్రం గురించి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అన్నం పెట్టే రైతులపై రాంగోపాల్ వర్మ నీఛమైన వ్యాఖ్యలు!



రాంగోపాల్ వర్మ పలు సందర్భాల్లో హద్దులు దాటే వ్యాఖ్యలు చేస్తూ వివాదాల్లో చిక్కుకుంటున్న సంగతి తెలిసిందే. వర్మ ఏ ఎంత మాట్లాడినా పబ్లిసిటీ కోసమే అనే అభిప్రాయం చాలా మందిలో నెలకొంది. ఇటీవల వర్మ సమర్పకుడిగా వ్యవహరించిన భైరవగీత చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రానికి వర్మ వద్ద అసిస్టెంట్ ఎడిటర్ గా పనిచేసిన సిద్దు దర్శకుడిగా వ్యవహరించాడు. ఈ చిత్రం గురించి మాట్లాడుతూ ఓ టివి చర్చా కార్యక్రమంలో వర్మ రైతులని కించపరిచే వ్యాఖ్యలు చేశాడు. దీనితో నెటిజన్లు మరోసారి వర్మపై దుమ్మెత్తి పోస్తున్నారు. భైరవ గీత చిత్రంలో హద్దులు దాటే రొమాన్స్, లిప్ లాక్ సన్నివేశాలు ఎక్కుగా ఉండడంతో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఓ టివి చర్చా కార్యక్రమంలో ఇలాంటి సినిమాలు తీసేకన్నా దేశానికి ఉపయోగపడే సినిమాలు చేయవచ్చుగా అని ఓ మహిళ వర్మకు చురకలంటించింది. నాకు రెస్పాన్సుబులిటీ లేదు. సమాజం పట్ల అంతకంటే ద్యాస లేదు. నేను ఇలానే ఉంటా అంటూ మరోమారు వర్మ తన పైత్యాన్ని ప్రదర్శించాడు. రైతులంటే చిరాకు సదరు టివి యాంకర్ మాట్లాడుతూ.. వర్మ గారూ మీ దర్శత్వంపై పబ్లిక్ లో మంచి అభిప్రాయం ఉంది. ఇలాంటి చిత్రాలు చేసే బదులు రైతు సమస్యలపై సినిమా చేస్తే జనాల్లోకి బాగా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. దీనికి బదులిస్తూ. రైతులపై వర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. రైతులంటే నాకు చిరాకు.. వాళ్ళు ఎప్పుడూ మట్టిలోనే ఉంటారు.. నాకు మట్టి అంటే అసహ్యం' అంటూ నీఛమైన వ్యాఖ్యలు చేశాడు. అందుకే రైతుల సినిమాలు తీయను అని వ్యాఖ్యానించాడు. అప్పుడు ఆలోచిస్తా ఒకవేళ రైతులు తుపాకులు, కత్తులు పట్టుకుంటే అప్పుడు ఆలోచిస్తా అని వర్మ తెలిపాడు. వర్మ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో దుమారం రేగుతోంది. నెటిజన్లు అతడిపై దుమ్మెత్తి పోస్తున్నారు. దేశానికి వెన్నెముకలాంటి రైతుపై ఇలాంటి వ్యాఖ్యలా చేసేది అంటూ విరుచుకుపడుతున్నారు. మరో వివాదాస్పద చిత్రంతో ఆర్జీవీ తెరకెక్కించే ప్రతి చిత్రం ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూనే ఉంటుంది. ఎన్టీఆర్ బయోపిక్ కు పోటీగా వర్మ మరో వివాదాస్పద చిత్రం లక్ష్మీస్ ఎన్టీఆర్ తెరకెక్కించేందుకు సిద్ధం అవుతున్నాడు. ఎన్టీఆర్ జీవితంలో అత్యంత వివాదభరితమైన అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తోంది.

# డోంట్ కేర్ అంటూ... అందాల ఆరబోతతో



నిఖిల్

మూవీ 'కిర్రాక్ పార్టీ'లో సెకండ్ హీరోయిన్‌గా నటించిన కన్నడ బ్యూటీ సంయుక్త హెగ్డేకు సంబంధించి థాలాండ్ ట్రిప్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ట్రిప్పుకు సంబంధించిన బికినీ ఫొటోస్, వీడియోస్ ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేశారు. సౌత్ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా నిలదొక్కుకోవడానికి స్ట్రగుల్ అవుతున్న సంయుక్త ఇకపై తెగింపుగా ముందుకు సాగాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగానే ఈ హాట్ ఫొటోస్ షేర్ చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ ఫొటోలు షేర్ చేస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు సైతం చర్చనీయాంశం అయ్యాయి. ఇతరుల ఓపీనియన్ మార్చడానికి నీ సమయం వేస్ట్ చేసుకోవద్దు. నువ్వు చేయాల్సింది చేసేయ్. అది ఇతరులకు నచ్చినా, నచ్చక పోయినా డోంట్ కేర్ అని సంయుక్త వ్యాఖ్యానించారు. సంయుక్త హెగ్డే కన్నడ చిత్రం 'కిరిక్ పార్టీ' ద్వారా సంయుక్త హెగ్డే నటిగా తన కెరీర్ ప్రారంభించారు. ఈ సినిమా తెలుగులో కిరాక్ పార్టీ పేరుతో రీమేక్ కావడంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. ఎంటీవీ రోడీస్, బిగ్‌బాస్ షోలో కూడా... 2016లో ఎంటీవీ రోడీస్ అనే రియాల్టీ షోలో పాల్గొని తన చైల్డ్ హుడ్ డ్రీమ్ నిజం చేసుకున్న సంయుక్త... 2017లో కన్నడ వెర్షన్ బిగ్ బాస్ షోలో కూడా కంటెస్టెంటుగా అవకాశం దక్కించుకున్నారు. 2018 అక్టోబర్లో ఎంటీవీ స్పిట్స్ విల్లా 11 సీజన్లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చింది.

### సత్యదేవుని దర్శించిన

# రిటైర్డ్ హైకోర్టు జడ్జి బిక్షపతి



అన్నవరంః తూర్పు గోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారిని శనివారము రిటైర్డ్ హైకోర్టు జడ్జి బిక్షపతి కుటుంబ సమేతముగా శ్రీ స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ సూపరింటెండెంట్ బలువు సత్య శ్రీనివాస్ ఘటన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పడితులు వేదాశీస్సులు అనంతరం శ్రీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

# నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### లోయలో పడిన ట్రక్కు .. 18 మంది మృతి

### పరిమితికంటే ఎక్కువ మంది ప్రయాణమే కారణం

### ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్మీ సేనలు



కాఠ్‌మాండూ: నేపాల్‌లోని నువాకోట్ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ మినీ ట్రక్కు అదుపుతప్పి కొండ మీద నుంచి నదిలో పడిపోయింది. ఈ ఘటనలో 18 మంది మృతిచెందారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

నువాకోట్‌లోని కిమ్‌తాంగ్ నుంచి సిసిపు వెళ్తున్న ఓ ట్రక్కు సముంద్రతర్ వద్ద అదుపుతప్పి కొండపై నుంచి నదిలో పడింది. ఘటన సమయంలో ట్రక్కులో 40 నుంచి 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారమందుకున్న పోలీసులు, భద్రతాసిబ్బంది, నేపాల్ ఆర్మీ ఘటనాస్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు.

ప్రమాదంలో 18 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలున్నారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కాఠ్‌మాండూ ఆసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులంతా తమ బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు పరిమితి కంటే ఎక్కువ మంది ఎక్కడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

### రాష్ట్రాభివృద్ధికి

# సమన్వయ కృషి అవసరం

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని



విశాఖపట్నంః రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించిన జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘం సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులను చేపట్టాలన్నారు.

డ్వామా పీడీ దయానిధి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు జరుగుతున్నాయన్నారు. ఫారం పౌండ్స్, ఘనవ్యర్థాలనిర్వహణ షెడ్లు, ఆట స్థలాలు, ఇంకుడు గుంటలు, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయితీ భవనాలు, స్మశాన వాటికల నిర్మాణాలు మొక్కల పెంపకం తదితరాల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడీ మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు సంబంధించి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గల అర్హులైన లబ్ధిదారులకు గృహాలను కేటాయించడం జరిగిందన్నారు. ఇడిఎస్‌సి కార్పొరేషన్ మాట్లాడుతూ పేదరికంలో ఉన్న ఎస్సీ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి 60 శాతం సబ్సిడీతో స్వయం ఉపాధి పథకాలను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు మాట్లాడుతూ జిల్లాలో 116 భారీ మరియు అతి భారీ పరిశ్రమలను స్థాపించి సుమారు 80 వేల మందికి పైగా ఉపాధి అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

2017-18 సంవత్సరానికి ఇప్పటి వరకు 602 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించి 9 వేల మందికి పైగా ఉపాధి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనపథకాన్ని 3864 పాఠశాలలో అందించడం జరుగుతుందన్నారు. 178 పాఠశాలలో వర్చువల్, 371 పాఠశాలలో డిజిటల్ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వైద్య శాఖాధికారి మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ తదితర వ్యాధులు పూర్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ అవసరమైన మందులను అందజేయడం జరిగిందని ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయన్నారు. పలకరింపు పథకం కింద అంగన్‌వాడీ, ఆశా, ఎఎన్‌ఎంలు ఇంటింటికీ పర్యటించి గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు ఇమ్యునైజేషన్, ఆరోగ్య పరిరక్షణపై తెలియ.జేయడం జరుగుతుందన్నారు. పంచాయితీ రాజ్ ఎస్‌ఇ మాట్లాడుతూ పిఎంజిఎస్‌వై పథకం కింద 206 పనులు మంజూరయ్యాయని, వాటిలో 7 పూర్తయ్యాయని, 143 వివిధ దశలలో ఉన్నాయని, 54 పనులను మొదలు పెట్టాల్సి ఉందన్నారు. తుపాను షెల్టర్లు, రోడ్డు నిర్మాణాలకు సంబంధించి 56 మంజూరవ్వగా అన్నీ పూర్తయ్యాయని అన్నారు. కన్వర్జెన్స్ పనుల కింద అంగన్‌వాడి, పంచాయితీ భవన నిర్మాణాలు, బిటి, సీసీ, గ్రావెల్ రోడ్లకు సంబంధించిన పనులు మొదలై వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్‌ఎస్‌ఇ మాట్లాడుతూ జిల్లా స్థాయి పథకాలు 1228 పనులలో 1185 పనులు పూర్తయ్యాయని, 43 పనులను మొదలు పెట్టాల్సి ఉందన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. బిసి కార్పొరేషన్ ఇడి మాట్లాడుతూ ఆదరణ పథకం కింద 43,856 లక్ష్యం కాగా 33,726 పనిముట్లను సెలెక్ట్ చేయడం జరిగిందన్నారు. 23,573 మంది లబ్దిదారులు డీడీలు కట్టారన్నారు. ఈ నెల 28నమెగా గ్రౌండింగ్ మేళా జరగనున్నదని, దీనికి ముఖ్యమంత్రి హాజరు కానున్నట్లు చెప్పారు. లబ్దిదారులకు బర్రెలు, ఆవులు పంపిణీ చరగనున్నదన్నారు.



స్థాయీ సంఘ సమావేశాలకు శాసనమండలి సభ్యులు పప్పల చలపతిరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పీలా గోవింద సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు, జెడ్‌పిసిఇఓ రమణమూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఆదిలో ఆసీస్ దెబ్బ కొట్టినా..!

# నిలబడిన కెప్టెన్ కోహ్లి, రహానె

### రెండో రోజు ఆట ముగిసే సమయానికి 172/3 పరుగులతో భారత్

పెర్త్: కెప్టెన్ విరాట్ కోహ్లి 82 (181 బంతుల్లో 9స4), అజింక్య రహానె 51 (103 బంతుల్లో 6స4, 1స6) అర్ధ శతకాలతో రాణించిన వేళ టీమిండియా మూడు వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. భారత్-ఆస్ట్రేలియాల మధ్య పెర్త్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా ఇంకా 154 పరుగులు వెనకబడే ఉంది. ఈ నేపథ్యంలో మూడో రోజు ఆట కీలకం కానుంది.

భారత్‌ను త్వరగా ఔట్ చేసి ఒత్తిడిలోకి నెట్టేయాలని ఆసీస్ భావిస్తుండగా, ఎలాగైనా క్రీజులో నిలబడి మ్యాచ్‌పై పట్టు సాధించాలని భారత్ భావిస్తోంది.

తొలి ఇన్నింగ్స్ 277/6 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఆతిథ్య జట్టు మరో 49 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. భారత బౌలర్లలో ఇషాంత్ శర్మకు నాలుగు వికెట్లు దక్కగా, బూమ్రా, ఉమేష్ యాదవ్, హనుమ విహారిలు తలో రెండు వికెట్లు తీశారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఎనిమిది పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. స్టార్క్ వేసిన 2.6 ఓవర్‌లో పరుగులేమీ చేయకుండానే మురళీ విజయ్(0) పెవిలియన్ చేరగా, హేజిల్ వుడ్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్(2) తక్కువ పరుగులకే ఔటయ్యాడు.

ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన పుజరా, విరాట్ కోహ్లీలు ఆసీస్ బౌలర్ల వేగానికి అడ్డుకట్ట వేశారు. క్రీజులో కుదురుకునేందుకు యత్నించారు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టేందుకు యత్నించారు. అయితే 103 బంతులు ఎదుర్కొని 24 పరుగులు చేసిన పుజరా స్టార్క్ బౌలింగ్‌లో పెయినీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ నేపథ్యంలో బ్యాటింగ్‌కు వచ్చిన రహానెతో కలిసి కోహ్లి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఇరువురూ ధాటిగా కంగారూలను ఎదుర్కొంటూ అర్ధ శతకాలు నమోదు చేశారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి కెప్టెన్ విరాట్ కోహ్లి 181 బంతుల్లో 82 పరుగులు చేయగా, రహానె 103 బంతుల్లో 51 పరుగులు చేశాడు.

ఆసీస్ బౌలర్లలో స్టార్క్ రెండు వికెట్లు తీయగా, హేజిల్‌వుడ్‌కు ఒక వికెట్ దక్కింది.

## ప్రభుత్వం తప్పుదోవ పట్టించింది

దిల్లీ: రఫేల్ ఒప్పంద విషయంలో ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అబద్ధాలు చెప్పి తప్పుదోవ పట్టించిందని పీఏసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అటార్నీ జనరల్, కాగ్‌కు సమన్లు పంపించే విషయంపై పార్లమెంటులోని ప్రజాపద్దుల కమిటీ సభ్యులతో చర్చిస్తానని ఖర్గే శనివారం తెలిపారు. కాగ్ ద్వారా తప్పుడు వివరాలను సుప్రీంకోర్టుకు ఇచ్చినందుకుగాను ప్రభుత్వం క్షమాపణలు చెప్పాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు.







# ఎన్నికల్లో అవతకతవకలు జరిగాయి..!

# ఈవియంలు టాంపర్ చేశారు!

### ప్రజాకూటమి ఓటమిపై కాంగ్రెస్ నేతలు మేథోమదనం

హైదరాబాద్ః తెలంగాణలో కేసీఆర్‌కు అసాధారణమైన ఫలితాలు రావడం, గులాబీ అభ్యర్థులకు ఊహించని మెజారిటీ రావడం వెనుక అనేక అనుమానాలను వ్యక్తంచేస్తోంది కాంగ్రెస్ పార్టీ. దీనిని ఇలాగే వదిలేస్తే భవిశ్యత్తులో మరింత నష్టపోతామన్నది కాంగ్రెస్ ఆలోచన. అందుకే పోలింగ్ సరళిలో జరిగిన అవకతవకలను బహిర్గతం చేయకపోతే రాబోవు రోజుల్లో పెను ప్రమాదం పొంచి ఉందని కాంగ్రెస్ భావిస్తోంది. పోలింగ్ బూత్ లలో ఏం జరిగింది., ఈవీయంలు ఎలా పని చేసాయి అనే అంశాల పట్ల సునిశిత సమాలోచనలు జరుపుతోంది కాంగ్రెస్ పార్టీ.

*గాంధీ భవన్‌లో ముఖ్యనేతల సమావేశం..!*
*ఎన్నికల సరళి పై సమీక్ష..!!*

ప్రజాకూటమి ఓటమిపై కాంగ్రెస్ నేతలు మేథోమదనం నిర్వహిస్తున్నారు. ఓటింగ్ శాతం, లెక్కింపుల్లో తేడాలు ముఖ్య అజెండాగా జరిగిన ఈ మీటింగ్ కు హైదరాబాద్ లోని గాంధీభవన్ వేదికయ్యింది.



దీనికి టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జానారెడ్డి, షబ్బీర్ అలీ, పొన్నం ప్రభాకర్, డీకే అరుణ వీహెచ్ తదితర కాంగ్రెస్ సీనియర్లు హాజరయ్యారు. ఎన్నికల్లో జరిగిన కొన్ని అనుమానాస్పద ఘటనలపై కోర్టుకు వెళ్లాలని వారు నిర్ణయించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ కచ్చితంగా జరిగిందన్నది కాంగ్రెస్ అనుమానం. అందుకే దీనిపై న్యాయపోరాటం చేయాలని రాష్ట్ర పార్టీ శాఖ నిర్ణయించింది.

*ఈసీ పారదర్శకంగా వ్యవహరించ లేదు..!*
*వాస్తవాలు నిరూపిస్తామంటున్న కాంగ్రెస్..!!*

ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ అధికారులపై కాంగ్రెస్ నేతలు పలు ఆరోపణలు చేశారు. టీఆర్ఎస్ వ్యూహాత్మకంగా పదవీ విరమణ పొందిన అధికారులను ఎన్నికల సంఘంలో కొనసాగేలా ప్లాన్ చేసిందని వారు ఆరోపించారు. 20 లక్షల ఓట్లు తొలగించడం అనేది చాలా తీవ్రమైన నేరమని, తెలంగాణ ఎన్నికల సంఘం ప్రధానాధికారి రజత్ కుమార్ వైఖరిపై వారు అనుమానాలు వ్యక్తంచేశారు. లోపాలను కేంద్ర ఎన్నికల సంఘానికి వివరిస్తామని, ఎన్నికల పోలింగ్ జరిగిన రోజు సాయంత్రం 5 గంటల తర్వాత పోలీసులు, పోలింగ్ అధికారులు కుమ్మక్కై రిగ్గింగ్ చేశారని వారు ఆరోపించారు. అందుకు కొన్ని రుజువులను కూడా కాంగ్రెస్ పార్టీ సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. యంత్రాంగం, యంత్రాలు ఏకమయ్యాయి..! కుట్రను ఛేదిస్తామంటున్న టీపిసిసి..! నర్సాపూర్ నియోజకవర్గంలో సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ శాతం 70. కానీ క్యూలో అప్పటివరకు ఉన్న వాళ్లు వేసినా అది ఐదు లేదా ఆరు శాతం పెరగాలి. చరిత్ర మొత్తం ఇదే చెబుతుంది. కానీ అక్కడ పోలింగ్ ఒక గంటలోనే 90 శాతానికి ఎలా పెరిగింది? అన్నది వారి అనుమానం. చిప్ లు పెట్టి మరీ ట్యాంపరింగ్ చేశారని, దీనిని అధ్యయనం చేశామని మీడియాకు వెల్లడించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ పై త్వరలో డెమో చూపిస్తామని ముఖ్య నేతలు చెప్పారు. జరిగిన అవతవకలను నిరూపించి కొన్ని నియోజక వర్గాల్లో రీపోలింగ్ నిర్వహించాలన్నది కాంగ్రెస్ పార్టీ ఉద్దేశంగా తెలుస్తోంది.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ĸ Phone : 2564353, Fax : 0891-2569004 ĸ e-mail: vijayabhanudaily@gmail.com